
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల

జిల్లా వార్తలు

ఆదివారం 4 మే 2025





# బొప్పాయి రైతు దిగాలు



చిన్నవంగలిలో గొర్రెలకు మేతగా వదిలేసిన బొప్పాయితోట



పెద్దవంగలిలో వైరస్‌తో దెబ్బతిన్న బొప్పాయి పంట

- రోజురోజుకూ పతనమవుతున్న ధరలు
- అందని పెట్టుబడులు
- వైరస్ సోకడంతో తగ్గిన దిగుబడులు
- తోటలను దున్నేస్తున్న రైతులు
- ఇటీవల గాలివానతో 70 ఎకరాల్లో నష్టం
- ప్రత్యామ్నాయ పంటలకు సిద్ధం

**చాగలమర్రి, మే 3 (ఆంధ్రజ్యోతి):** ఆరుగాలం కష్టపడే అన్నదాతకు ఇక్కట్లు తప్పడం లేదు. అతి, అనావృష్టిలే కాకుండా వైరస్, మార్కెటింగ్, ధరలు తదితర సమస్యలతో నిత్యం పోరాటం తప్పడం లేదు. కాస్తో.. కూస్తో ధర ఉంది అనుకునేసరికి ఒక్కసారిగా పతనం కావడంతో బొప్పాయి రైతు దిగాలు చెందుతున్నాడు. వైరస్ సోకి బొప్పాయి కాయలు కాస్త పండు బారాయి. గత నెల టన్ను రూ.20వేలు ధర పలికింది. ప్రస్తుతం రూ.5 వేలకు పడిపోయింది. కాయలు పక్వానికి వచ్చి కోత కోసే సమయంలో ధరలు పతనం కావడంతో రైతులు నష్టపోతున్నారు. పెట్టుబడి రూపంలో రూ.2కోట్ల దాకా నష్టం వాటిల్లిందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

బొప్పాయి ధర పతనమైంది. దీంతో పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు దిగాలు చెందుతున్నారు. పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాల్లో 300 ఎకరాల్లో బొప్పాయి సాగుచేశారు. ధరలు లేకపోవడంతో ఆయా గ్రామాల్లో బొప్పాయి పొలాలను దున్నేస్తున్నారు. ఎకరాకు రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టి సాగుచేసిన ఈ పంట వైరస్ మూలంగా ఆకులు ముడుచుకుపోయి పండు బారాయి. దీంతో దిగుబడి రావడం లేదు. ఎకరాకు 30టన్నులు దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 20 టన్నులు మాత్రమే వస్తోంది. పెట్టుబడి కూడా చేతికందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గతనెల టన్ను రూ.20వేలు ధర పలికింది. ప్రస్తుతం రూ.5 వేలకు పడిపోయింది. కాయలు పక్వానికి వచ్చి కోత కోసే సమయంలో ధరలు పతనం కావడంతో రైతులు నష్టపోతున్నారు. పెట్టుబడి రూపంలో రూ.2కోట్ల దాకా నష్టం వాటిల్లిందని రైతులు అంటున్నారు. చిన్నవంగలిలో 50 ఎకరాల దాకా బొప్పాయి తోటలను దున్నేశారు. ఇటీవల పెనుగాలుల బీభత్సంతో 70 ఎకరాల్లో బొప్పాయి తోటలు విరిగిపడి భారీగా నష్టపోయారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు సిద్ధపడ్డారు. నష్టపోయిన బొప్పాయి తోటలకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### ధర లేక దున్నేశా..



నాలుగెకరాల్లో బొప్పాయి తోట సాగుచేశా. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టా. వైరస్ సోకడంతో చెట్లు దెబ్బతిని దిగుబడి తగ్గిపోయింది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. ధర ఒక్కసారిగా పతనమైంది. దీంతో భారీగా నష్టపోవాల్సి వస్తోంది. వ్యాపారులు కూడా ముందుకు రాకపోవడంతో ప్రత్యామ్నాయ పంట సాగు చేసేందుకు తోటలను దున్నేశా.

- వెంకట్‌రెడ్డి, రైతు, చిన్నవంగలి

### రాయితీ కల్పించి ఆదుకోవాలి



ఉద్యాన పంటలకు రాయితీ కల్పించాలి. రెండెకరాల్లో కౌలుకు తీసుకొని పంట సాగుచేశా. ఎకరాకు రూ.1.30 లక్షలు పెట్టుబడి పెట్టా. పెట్టుబడి కూడా రాకపోవడంతో బొప్పాయి తోటలను దున్నేశా. గత నెల టన్ను రూ.20 వేలు ధర పలికింది. టన్ను రూ.5 వేలకు పడిపోయింది. భారీగా నష్టపోయాం. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

- నరసింహుడు, కౌలు రైతు, చిన్నవంగలి

# పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

- నెట్, జిరాక్స్ సెంటర్లు మూసివేయాలి
- ట్రాఫిక్ సమస్య ఉండకూడదు
- ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా
- నీట్ పరీక్షా కేంద్రాల తనిఖీ

**నంద్యాల టౌన్ మే, 3 (ఆంధ్రజ్యోతి):** నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ ) పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా అన్నారు. శనివారం నీట్ పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, జూనియర్ కళాశాలలలో ఆదివారం నీట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1,172 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షకు హాజరయ్యే సమయంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ఉన్న జిరాక్స్, నెట్ సెంటర్లు పరీక్ష ముగిసేవ వరకు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులను ప్రతిఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీచేసి లోపలికి పంపాలన్నారు. అవసరమైతే డ్రోన్ కెమెరాల ద్వారా పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తామన్నారు. ఆయనతో పాటు ఆర్డీవో విశ్వనాథ్, తహసీల్దార్ ప్రియదర్శిని, నీట్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, సీఐలు ఇస్మాయిల్, కంబగిరిరాముడు, సూర్యమౌళి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ, అధికారులు

# మద్దతు ధరతో జొన్నలు కొనుగోలు

- 30వేల టన్నుల కొనుగోళ్లకు అనుమతి
- రైతుల గోడౌన్ల వద్ద నిరీక్షించొద్దు
- ఎఫ్ఏక్యూ నాణ్యతా ప్రకారమే కొంటాం
- జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్



మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

**నంద్యాల నూనెపల్లె, మే 3 (ఆంధ్రజ్యోతి) :** మద్దతు ధరతో జొన్నలు కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జొన్నల కొనుగోలు అంశాలపై సంబంధిత అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 30వేల టన్నుల జొన్నల కొనుగోలుకు అనుమతి ఉందని అన్నారు. ఇప్పటివరకు 5వేల మెట్రిక్‌టన్నుల జొన్నలు మాత్రమే కొనుగోలు చేశామని, ఇంకా 25వేల టన్నుల జొన్నలు కొనుగోలు చేసేందుకు అవకాశం ఉందన్నారు. రైతు సేవాకేంద్రాల పరిధిలో వ్యవసాయ సిబ్బంది షెడ్యూలింగ్ చేసుకున్న తర్వాతనే జొన్నలు అన్‌లోడింగ్‌కు తెచ్చేలా రైతులకు తెలపాలని అధికారులను ఆదేశించారు. షెడ్యూల్ చేసుకున్న ప్రతి రైతు తమ పత్రాలను కచ్చితంగా తీసుకురావడంతోపాటు అపాయింట్ చేసిన ఏజెన్సీవారికి ఇచ్చి ఆన్‌లైన్‌లో ట్రాక్ షీట్ జనరేట్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు జొన్నల వాహనాలను గోడౌన్‌కు తెచ్చి రెండు, మూడు రోజులు నిరీక్షించవద్దన్నారు. రైతులు అపోహలకు గురికావద్దని ఎఫ్ఏక్యూ నాణ్యతా ప్రమాణాల ప్రకారం ఉన్న ప్రతి రైతు జొన్నలు కొంటామని ఆయన వివరించారు.

## సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి: కలెక్టర్

**నంద్యాల నూనెపల్లె, మే 3(ఆంధ్రజ్యోతి):** నవోదయం 2.0 కింద జిల్లాను సారారహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శనివారం మద్యపాన వ్యసనంతో కలిగే దుష్ప్రభావాలు-నియంత్రణపై కమిటీ సభ్యులతో కలెక్టర్ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు సారావల్ల కలిగే అనర్థాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా డోన్, బనగానపల్లె, ఆత్మకూరు మండలాల పరిధిలో 19 గ్రామాలు ఎ-కేటగిరిగా, 1 9గ్రామాలు-బి కేటగిరిగా మిగతా గ్రామాల్లో సారా విక్రయ కేంద్రాలు ఉన్నాయని, వాటి పరిధిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో డీ-అడిక్షన్ సెంటర్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.

# 4,500 ఎకరాల్లో పండ్ల తోటల సాగు

- జిల్లాలో 82వేల మంది ఉపాధి కార్మికులు
- కార్మికుల ఖాతాల్లో పెండింగ్ వేతనాలు జమ
- ఉపాధి హామీ పీడీ వెంకటసుబ్బయ్య



మాట్లాడుతున్న ఉపాధి హామీ పీడీ వెంకటసుబ్బయ్య

**చాగలమర్రి, మే 3 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో 4,500 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యంగా ఉందని ఉపాధి హామీ పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి శ్రామికుల సంఖ్యను పెంచాలని, నీటి కుంటలు తవ్వుకునేలా చూడాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో 82వేల మంది ఉపాధి కార్మికులు పనులు చేస్తున్నారన్నారు. రెండు రోజుల్లో లక్ష వరకు ఉపాధి శ్రామికుల సంఖ్య లక్ష్యం ఉందన్నారు. పంటలు సాగు చేసే రైతులకు 100శాతం రాయితీ ఉంటుందని, డ్రిప్ స్ప్రింక్లర్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, ఇతరులకు 50 శాతం సబ్సిడీ ద్వారా పంపిణీ చేస్తారన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాల బకాయిలు మార్చి చివరి వరకు మంజూరయ్యాయని అన్నారు. రూ.40 కోట్లు ఉపాధి వేతనాలు ఉపాధి కార్మికుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. చాగలమర్రి మండలంలో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీవోకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

# జడ్పీలో పదోన్నతులు

**కర్నూలు న్యూసిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న ముగ్గురు రికార్డు అసిస్టెంట్లకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఎస్.కొత్తపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో పని చేస్తున్న రికార్డు అసిస్టెంట్ వీరశేఖర రాజుకు జడ్పీహెచ్‌ఎస్ బలపనూరు, దేవనకొండ జడ్పీహెచ్‌ఎస్‌లో పని చేస్తున్న అన్వర్‌కు జూపాడుబంగ్లా మండల పరిషత్ కార్యాలయం, బనగానపల్లె జడ్పీహెచ్‌ఎస్‌లో పని చేస్తున్న జాకీర్ హుశేన్‌ను కోవెలకుంట్ల మండల పరిషత్ కార్యాలయానికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# లక్ష్యం చేరుకుంటారా..!



వెలుగోడులో లెంటల్ లెవల్ వరకు వచ్చిన గృహాలు

- గృహ నిర్మాణాలు పూర్తి చేయడానికి అధికారుల సమాయత్తం
- 73.13 శాతం మిగులు పనులు

**నంద్యాల కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి):** గత ప్రభుత్వంలో చతికలబడ్డ గృహ నిర్మాణాలతో ఆందోళన చెందుతున్న లబ్ధిదారులకు ఊరట కలిగించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సీఎం చంద్రబాబునాయుడు ధృడ సంకల్పంతో జిల్లా అధికారులకు సూచనలిచ్చి తగిన నిధులు విడుదల చేయడంతో లబ్ధిదారుల కష్టాలు తొలగినట్లయింది. ఆ మేరకు కలెక్టర్లు హౌసింగ్ అధికారులు రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని గృహనిర్మాణాల పని జూన్ నెల మొదటి వారానికల్లా పూర్తిచేయాలని కంకణం కట్టుకున్నారు. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ సిబ్బందిని అప్రమత్తం చేశారు. మున్సిపాలిటీలు, పంచాయతీలు, గ్రామీణ ప్రాంతాల అధికారులకు అవగాహన కల్పించి లబ్ధిదారులకు.. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు అదనంగా రూ. 50వేలు, రూ. 75వేలు, రూ. లక్ష, నిధులు మంజూరు చేశారు. దీనిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఎక్కడికక్కడ ఎలాంటి సమాచార లోపం లేకుండా గృహ నిర్మాణం పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కలెక్టర్ రాజకుమారి సైతం దీనిపై దృష్టి సారించారు. గతవారంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రోజువారీ లక్ష్యం పట్ల గృహనిర్మాణ శాఖ పీడీ హరగోపాల్ మానిటరింగ్ చేస్తున్నారు. గత జూన్ నుంచి ఈ ఏప్రిల్ దాకా కేవలం 26శాతం(2,534) గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 75 శాతం ఇల్లు (6,898) దాకా పూర్తి చేయాల్సి వుంది. కేవలం నిర్దేశిత లక్ష్యానికి దాదాపు 45 రోజులు మాత్రమే మిగిలివుంది. ఈ లోపల ఇండ్ల నిర్మాణ పనులు పూర్తిచేస్తారా లేదా? అనేది వేచి చూడాల్సి ఉంది. నిధుల కొరత లేకపోవడంతో లబ్ధిదారులు కూడా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. దీనికి రూ.45,61,20,000 మంజూరయ్యాయి.

### నూతన గృహాలు మంజూరు

నంద్యాల జిల్లాలోని నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, డోన్, బేతంచెర్ల, నందికొట్కూరు తదితర మున్సిపాలిటీలలో 1892 నూతన గృహాలకు ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం ఇవికాక 6,898 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయి.

- **కొనసాగుతున్న పనులు:** గత ప్రభుత్వంలో 46,566 గృహాలు మంజూరు కాగా వీటిలో 27302 గృహాలు పూర్తయ్యాయి. మిగిలిన 19,264 గృహాలు వివిధ నిర్మాణ దశలలో ఉన్నాయి. వీటిలో 3,996 గృహాలకుగాను బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అదనపు ఆర్థిక సాయం కింద 5.96 కోట్ల రూపాయలు అందించడం ద్వారా లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమైంది. త్వరలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవడానికి సముఖత వ్యక్తం చేస్తున్నారు.
- **ఎన్టీఆర్ గృహ నిర్మాణాలకు నిధులకు ప్రతిపాదనలు:** ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద వివిధ దశలలో వున్న గృహాల సంఖ్య 28,512 వీటిలో 7,686 పూర్తికాగా 20,826 గృహాలు వివిధ నిర్మాణాల దశలలో ఉన్నాయి. పూర్తికాని గృహాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పీఎంఏవై 2.0 అర్బన్, గ్రామీణ పథకం కింద మొబైల్ యాప్ ద్వారా సర్వే నిర్వహించి దాదాపు రూ.49కోట్ల నిధులకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని గృహనిర్మాణ శాఖ పీడీ హరగోపాల్ తెలిపారు.



సంజామలలో బేస్‌మెంట్ వరకు వచ్చిన గృహాలు

- **పీఎం జన్మన్ కింద 527 గృహాలు మంజూరు:** చెంచు వర్గాలవారికి పీఎం జన్మన్ కింద 527 గృహాలు మంజూరు కాగా అందులో ఇప్పటికి నాలుగు మాత్రమే పూర్తి అయ్యాయి. 71 గృహాలు వివిధ నిర్మాణ దశలలో ఉన్నాయి. మార్చి 2026 కల్లా పూర్తి చేయాలని ఎంఆర్‌డీ అధికారులు అధికారులను ఆదేశించారన్నారు.

### గృహ నిర్మాణాలపై అధికారులకు, లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం



కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు కలెక్టర్ రాజకుమారి సమీక్ష సమావేశం నిర్వహించి గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఆమేరకు 6,898 గృహాలను జూన్ మొదటి వారానికి కల్లా పూర్తిచేసేందుకు చురుకుగా పనులు చేస్తున్నాం. దానిని అనుసరించి సంబంధిత శాఖల అధికారులకు, లబ్ధిదారులకు అవగాహన కల్పించాం. ప్రభుత్వం కూడ వీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి అదనపు ఆర్థిక సాయం కోసం నిధులను మంజూరు చేసింది.

-హరగోపాల్, పీడీ, హౌసింగ్

## మున్సిపల్ ఆర్వోగా వెంకటరెడ్డి బాధ్యతలు



**నంద్యాల టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల మున్సిపాలిటీ రెవెన్యూ అధికారిగా వెంకటరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన డోన్ నుంచి పదోన్నతిపై ఇక్కడికి ఆర్వోగా వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఆర్వో ఆంజనేయులు మార్కాపురం మేనేజర్‌గా వెళ్లారు. అనంతరం ఆర్వో కమిషనర్ నిరంజన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ దాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

## 11న లక్ష్మీనరసింహ స్వామి జయంతి

**ఆత్మకూరు, మే 3 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని అతిపురాతన నల్లకాల్వ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో ఈనెల 11వ తేదిన ఆదివారం వైశాఖ చతుర్దశి స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారి జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ఎస్వీ రమణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. నరసింహస్వామి జయంతి వేడుకలను సందర్భంగా ప్రాతఃకాల సమయం నుంచి స్వామి, అమ్మవార్లకు పంచసూక్తములతో, పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమార్చనలతో పాటు విశేష అలంకరణ చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా లక్ష్మీనరసింహస్వామి అమ్మవార్ల కళ్యాణ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## రాష్ట్రానికి నిధులు కేటాయించాలి: సీపీఐ

**నంద్యాల రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రానికి కేంద్రం నిధులు కేటాయించాలని, ఆ మేరు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేంద్రం నుంచి తెచ్చుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలోని కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2014లో రాజధాని ప్రారంభోత్సవానికి వచ్చిన మోదీ మట్టి, నీళ్లు ఇచ్చారని, ఇప్పుడు వచ్చి వెళ్లినా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న నమ్మకం లేదని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాబాఫక్రుద్దీన్, నాగరాముడు తదితరులు పాల్గొన్నారు.

## 'కులగణన నిర్ణయం అభినందనీయం'

**పాములపాడు, మే 3(ఆంధ్రజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణను చేయాలని నిర్ణయించడం అభినందనీయమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జాతీయ బీసీ సంక్షేమసంఘం జిల్లా కార్యదర్శి ఆర్ఎస్ఆర్ గోపాల్ కృతజ్ఞతలు తెలిపారు. పాములపాడులో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 75 కోట్లకు పైగా ఉన్న బీసీ వర్గాల చిరకాల డిమాండ్‌ను కేంద్రం గౌరవించడం హర్షణీయమన్నారు. 1931 సంవత్సరంలో బ్రిటీష్ ప్రభుత్వంలో తీసిన లెక్కల తర్వాత నేడు నరేంద్ర మోదీ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. కులగణన తర్వాత బీసీలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ సనాభ ప్రకారం విద్య, ఉద్యోగ, ఉపాది రాజకీయ రంగాల్లో రిజర్వేషన్ల పెంపు వంటి నిర్ణయాలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. సామాజిక న్యాయ వ్యవస్థలో ఇది ముందడుగు అవుతుందని, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, జాతీయ బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## 'అనుమతి ఉన్న ఎరువులనే విక్రయించాలి'

**పాములపాడు, మే 3(ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఎరువుల దుకాణదారులు రైతులకు నాణ్యమైన ఎరువులను అనుమతులు కలిగిన పురుగు మందులు, విత్తనాలను విక్రయించాలని లేకుంటే చర్యలు తప్పవని ఏవో ఫణీశ్వరరెడ్డి హెచ్చరించారు. శనివారం పాములపాడులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల ఎరువుల దుకాణదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ దుకాణదారులు లైసెన్స్‌లు రెన్యువల్ చేయించుకోవాలని, విత్తనాలు, ఎరువుల డీలర్లు ఓఎల్ఎంఎస్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్టర్లు సక్రమంగా ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న సీహెచ్‌వోలు

**నంద్యాల హస్పిటల్, మే 3 (ఆంధ్రజ్యోతి):** గత రెండేళ్లుగా జీతభత్యాల విషయంలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నామని, వాటిని పరిష్కరించాలని కోరుతూ సీహెచ్ఓలు నిరసన తెలిపారు. నంద్యాలలో వారు చేపట్టిన నిరసన శనివారం 6వ రోజుకు చేరింది. సీహెచ్ఓలు యోగాసనాలతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలోని ఎన్‌హెచ్ఎం కింద సమస్యలతో సతమతమవుతున్నామని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఆరేళ్లు దాటిన సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని, ఎన్‌హెచ్ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, జీతంతోపాటు ప్రతినెలా ఇన్సెంటివ్ ఇవ్వాలని, ఏటా 5శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. ఆర్థిక, ఆర్థికేతర డిమాండ్లు సాధించేవరకు శాంతియుతమైన నిరసన తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో నంద్యాల ఏపీఎంసీఏ జిల్లా ప్రెసిడెంట్ శివకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సౌందర్య, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్, సెక్రటరి అఖిల్, భార్గవ్, ఏపీఎంసీఏ కమ్యూనిటీహెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## 'ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి'

**నంద్యాల రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి):** ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు యేసురత్నం, జిల్లా కార్యదర్శి రమణకుమారి డీపీవోకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్స్ కు కనీస వేతనం రూ.26 వేతనం ఇవ్వాలన్నారు. వారు నిత్యం చిన్నపిల్లలకు, గర్భిణులకు, ఎంతో సేవ చేస్తున్నారని అన్నారు. పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాలు ఏవీ వీరికి అమలు కాలేదన్నారు. అలాగే రాజకీయ కక్ష సాధింపులో భాగంగా ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో షమీం, శివమ్మ, జయలక్ష్మి పాల్గొన్నారు.

## రేపటి నుంచి ఆధార్ క్యాంపులు

**జూపాడుబంగ్లా, మే 3(ఆంధ్రజ్యోతి):** మండలంలోని వివిధ గ్రామాల్లో ఈనెల 5నుంచి 8వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గోపీకృష్ణ తెలిపారు. ఈనెల 5,6 తేదీల్లో 80బన్నూరు, పారుమంచాల గ్రామాల్లోని సచివాలయాల్లో చేపడుతున్నట్లు చెప్పారు. ఈనెల 7, 8 తేదీల్లో తాటిపాడు, తూడిచర్ల గ్రామాల్లో క్యాంపు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పింఛన్ల పంపిణీ

**బండిఆత్మకూరు, మే 3(ఆంధ్రజ్యోతి):** మండలంలోని అన్ని గ్రామాల్లో కొత్తగా మంజూరైన వితంతు పింఛన్లను స్థానిక టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధుల చేత సచివాలయ అధికారులు పంపిణీ చేశారు. మండలానికి 75 కొత్త వితంతు పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో దస్తగిరి తెలిపారు. ఎ.కోడూరు గ్రామంలో టీడీపీ నాయకుడు వడ్డు మధుసూదన్‌రెడ్డి, కేసీ నీటి సంఘం అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, శివకుమార్ నూతనంగా మంజూరైన పింఛన్లను అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ రవి, డిజిటల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

# మొదలైన వేసవి దుక్కులు

● తొలకరి వర్షాలు కురిస్తే.. పంట భూములకు ప్రయోజనం ● పొలాలను సిద్ధం చేసుకుంటున్న రైతన్నలు



పొలాన్ని దున్నుతున్న రైతులు

**ఆత్మకూరు, మే 3(ఆంధ్రజ్యోతి):** తొలకరి వర్షాలకు రైతన్నలు ముందుగానే వేసవి దుక్కుల్లో నిమగ్నమయ్యారు. గత ఏడాది ఆశించినస్థాయిలో పంట దిగుబడులు రాకపోవడంతో రైతులు వచ్చే ఖరీఫ్ సీజన్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. దీంతో తమ పంటభూములను సాగుకు సిద్ధం చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే మండలంలోని కరివేన, నల్లకాల్వ, బాపనంతాపురం, ముష్టేపల్లి, సిద్దేపల్లి, వెంకటాపురం, సిద్దాపురం, కృష్ణాపురం, అమలాపురం, శ్రీపతిరావుపేట, వడ్లరామాపురం, కురుకుంద, ఇందిరేశ్వరం తదితర గ్రామాలలోని రైతులు ముందస్తుగానే వేసవి దుక్కులు దున్నుకుంటున్నారు. ప్రత్యేకించి వేసవి దక్కులను ప్రధానంగా నాగలితో నేలను వాలుకు అడ్డంగా దున్నుకోవాల్సి వుంటుంది. తొలకరి వర్షాలకు ముందే కనీసం రెండుసార్లు భూమిని దున్నుకుంటే వేసవి దుక్కుల వల్ల పంటభూములకు మరెన్నో ప్రయోజనాలు చేకూరి సత్ఫలితాలను పొందవచ్చు. ఇప్పటికే వేసవి దుక్కుల వల్ల కలిగే ప్రయోజనాలను ఆయా గ్రామాల్లో వ్యవసాయాధికారులు, సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో రైతులు వేసవి దక్కులను దున్నుకునేందుకు బిజీబిజీ అయ్యారు.

**వేసవి దుక్కులతో కలిగే ప్రయోజనాలు:**

లోతు దుక్కుల వల్ల నేలలో వర్షపునీరు ఇంకిపోయి అక్కడికక్కడే ఇంకిన నీరు సంరక్షించబడి భూగర్భ జలాలు పెంపొందడమే గాకుండా భూసారాన్ని కూడా కాపాడవచ్చు. వేసవిలో పగటి వేడిమి తాపానికి, రాత్రి చల్లదనానికి నేల గుల్లగా తయారవడంవల్ల నేల ఆకృతి వృద్ధి చెందుతుంది. వేసవిలో దున్నడంవల్ల నేల పొరల్లో వున్న క్రిములు, కీటకాలు కోశస్థ దశలో బహిర్గతం అవడం, కలుపు విత్తనాలు కూడా వేడిమికి నశిస్తాయి. దీనివల్ల పంట కాలంలో కలుపు మందులకు, క్రిమిసంహారక మందులకు వెచ్చించాల్సిన ఖర్చులు కూడా తగ్గుతాయి. వేసవిలో దుక్కులు చేసుకోవడంవల్ల జూన్‌లో తొలకరి వర్షాలకు పంట విత్తుకోవడం సులభతరమవుతుంది. వర్షాధార మెట్ట వ్యవసాయం రైతుల లాభాలు పొందడానికి వేసవిలో లో దుక్కులు తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించి ఖరీఫ్ సాగుకు ప్రోత్సహిస్తున్నారు.

### వేసవి దుక్కులతో పంట భూములకు ప్రయోజనం



రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఆయా పంటపొలాల్లో వేసవి దక్కులను దన్నుకోవడం వల్ల పంట భూములకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. భూమిలో తేమశాతం పెంచేందుకు అవకాశం ఉండటంతో చీడపీడల నివారణ, కలుపు మొక్కల నియంత్రణకు దోహదపడుతోంది. తొలకరి వర్షాలకు ముందే వేసవి దుక్కులు చేసుకోవడం వల్ల రైతులకు అన్ని విధానం ప్రయోజనం ఉంటుంది.

\- విష్ణువర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, ఆత్మకూరు

# తల్లిదండ్రులు గర్వపడే స్థాయికి ఎదగాలి: కలెక్టర్

● పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన సభ



పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థినికి జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల నూనెపల్లె, మే 3 (ఆంధ్రజ్యోతి):** తల్లిదండ్రులు గర్వపడే స్థాయికి పిల్లలు ఎదగాలని కలెక్టర్ రాజకుమారి ఆకాంక్షించారు. పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి రాయలసీమ జోన్‌లో జిల్లాను మొదటి స్థానంలో ఉంచడానికి కృషిచేసిన విద్యార్థులను కలెక్టర్ రాజకుమారి అభినందించారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్‌తోపాటు డీఈవో జనార్దన్‌రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, డీసీవో శ్రీదేవి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో 81శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడం ఆనందంగా ఉన్నారు. ఇదే పరంపరను జీవితంలో ఆఖరిమెట్టువరకు కొనసాగించాలని అన్నారు. పదోతరగతి ఉత్తీర్ణతతో మురిసిపోకుండా భవిష్యత్‌లో రాబోయే పోటీ పరీక్షల్లో విజయాలు సాధించాలని అందుకు నిరంతర సాధన చేయాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులు చెప్పిన అంశాలను తప్పనిసరిగా పాటిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆకాంక్షించారు. జిల్లాలో 19శాతం విద్యార్థులు పదోతరగతిలో ఉత్తీర్ణత సాధించలేకపోయారని, కారణాలు విశ్లేషించి సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేవిధంగా సంసిద్ధులను చేయాలని ఆదేశించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మెమెంటోతో అభినందించారు. ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ర్యాంక్ సాధించిన గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి నర్సిరెడ్డిని కలెక్టర్ రాజకుమారి, డీఈవో జనార్దన్‌రెడ్డి అభినందించారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జరిగిన పదోతరగతి విద్యార్థుల సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్, డీఈవో రాష్ట్ర స్థాయిలో 600 మార్కులకు 597మార్కులు సాధించిన నర్సిరెడ్డిని మెమెంటో, ప్రశంసాపత్రం అదజేసి అభినందించారు.

## ఆపరేషన్ కగార్‌ను ఉపసంహరించుకోవాలి




ర్యాలీలో పాల్గొన్న వామపక్షాల నాయకులు

**నందికొట్కూరు, మే 3(ఆంధ్రజ్యోతి):** ఆపరేషన్ కగార్‌ను ఉపసంహరించుకోవాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నందికొట్కూరులో ఆ పార్టీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి పాత బస్టాండ్ నుంచి పటేల్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా నడుచుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. ఆదివాసులను, వారికి అండగా ఉన్న మావోయిస్టులను హతమార్చేందుకు కర్రిగుట్టల అడవులను చుట్టుముట్టారని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా కర్రెగుట్ల దాడిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు మజీదుమియా, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, పీవైఎల్ జిల్లా నాయకులు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## 'వీధిలైట్లకు మరమ్మతులు చేయించాలి'

**కొత్తపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి):** పాడైపోయిన వీదిలైట్లకు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు మహబూబూబ్ బాషా తదితరులు కోరారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మేరీకి వీదిలైట్లు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ముస్లీం కాలనీలో వీధిలైట్లు పాడైపోవడంతో వెలగడం లేదన్నారు. దీంతో రాత్రివేళ, సాయంత్రం వేళలో పాములు ఇళ్లలోకి వస్తున్నాయన్నారు. నెల రోజులు గడుస్తున్నప్పటికీ పంచా యతీ అధికారులు ఎన్నిసార్లు విన్నవించుకున్నా కనీసం పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ సమస్యలను తీర్చాలని ఎంపీడీవోను కోరారు.

## రిజిస్ట్రేషన్ చేయాలి: ఏవో

**కొత్తపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి):** విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రిజిస్టర్ కానీ రైతులను గుర్తించి వారి రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి మహేష్ సూచించారు. మండలంలోని వ్యవసాయ సిబ్బంది ఆయా గ్రామాలకు కేటాయించిన మట్టి నమూనాలను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. శనివారం మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని కౌలు రైతులను గుర్తించి వారికి పంట సాగు ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలని సూచించారు. వేసవిలో బోర్లు, బావుల కింద మినుము, పెసర, పిల్లి పెసర వంటి పప్పు జాతి పంటల సాగు ప్రాముఖ్యతను రైతులకు వివరించి సాగును పెంచాలని తెలిపారు. కంది పంటను ప్రభుత్వ మద్దతు ధర కోసం ఇంకా రిజిస్ట్రేషన్ చేయని రైతులను నిర్ణీత సమయంలో రిజిస్టర్ చేయాలని కోరారు.

## 'కార్మికుల హక్కులను కాలరాస్తే సహించం'




పగిడ్యాలలో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

**పగిడ్యాల, మే 3(ఆంధ్రజ్యోతి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని, కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఏఐటీయూసీ నాయకుడు ఇబ్రహీం అన్నారు. పగిడ్యాల బస్టాండ్ ఆవరణలో పార్టీ జెండాను శనివారం ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్నికి పాలక ప్రభుత్వాలు ముందకు సాగాలనారు. ఏఐటీయూసీ నాయకులు చాంద్‌బాషా, అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** మేడే స్ఫూర్తితో సాధించుకున్న కార్మిక, కర్షక హక్కులను కాపాడుకుందామని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సీటీయు పట్టణ ఉపాధ్యక్షులు రణధీర్ పేర్కొన్నారు. శనివారం మేడే ఉత్సవాల్లో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని



ఆత్మకూరులో రైతు సంఘం జెండాను ఆవిష్కరించిన జిల్లా కార్యదర్శి రాజశేఖర్

ఏకలవ్యానగర్‌లో రైతు సంఘం జెండాను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 1886 సంవత్సరంలో అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన 24గంటల పనిదినానికి వ్యతిరేకంగా పోరాడి ఎందరో కార్మికులు ప్రాణాలను అర్పించారన్నారు. నాటి ఉద్యమఫలితమే నేడు 8గంటల పనిదినాన్ని సాధించడం జరిగిందన్నారు. ప్రపంచ బ్యాంక్ పద్ధతులను అనుసరిస్తూ కార్మికులపైన, సామాన్య ప్రజలపైన ప్రభుత్వం అధిక భారంమోపిందన్నారు. కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందేలా కృషిచేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులు, కర్షకులు, ఉద్యోగస్తులు తమ హక్కుల కోసం పోరాటాలు చేసి సాధించుకోవాలని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక కోడ్‌లను అమలు చేయాలని అన్నారు. అనంతరం మహిళలకు మ్యూజిక్ చైర్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ప్రజాసంఘాల నాయకులు వీరన్న, వెంకటేశ్వర్లు, దాసమ్మ, మనెమ్మ, స్వర్ణ, ఈశ్వరమ్మ తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**పాణ్యం, మే 3 (ఆంధ్రజ్యోతి):** పాణ్యం పెట్రోల్ బంకు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాద ంలో గోరుకళ్లుకు తండాకు చెందిన మనోజ్ నాయక్ (25) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. మోటార్ సైకిల్‌పై నంద్యాల వైపు వెళుతూ అదుపుతప్పి కింద పడిపోవడంతో మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మనోజ్ నాయక్‌కు భార్య పిల్లలు ఉన్నట్లు తెలిపారు.

## ఇద్దరికి గాయాలు

**కొత్తపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి):** ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులకు రక్తగాయాలైన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎర్రమఠం గ్రామ పంచాయతీ మజారా గ్రామమైన పాతమాడుగుల గ్రామానికి చెందిన నాగరాజు, వెంకటనారాయణ, విజేయుడు సుమంత్ అనే యువకులు నలుగురు ఒకే బైకుపై కొత్తపల్లి మండల కేంద్రానికి సొంత పనులపై వెళ్లారు. పనులు ముగించుకుని గ్రామానికి తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో పెద్ద గుమ్మడాపురం గ్రామం బస్ షెల్టర్ సమీపంలోని ఈ చెట్ల మలుపు వద్ద ఎర్రమఠం వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని ఓ బైకు ఢీకొట్టింది. దీంతో వారందరూ కింద పడి గాయాలపాలయ్యారు. 108కి ఫోన్ సమాచారం ఇవ్వగా.. 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం అందిస్తున్నట్లు వైద్యసిబ్బంది రాజశేఖర్ తెలిపారు.

## దొంగతనం కేసులో ముగ్గురి అరెస్టు



నిందితుల అరెస్టును చూపుతున్న సీఐ

**నంద్యాల టౌన్ మే, 3 (ఆంధ్రజ్యోతి):** మహిళ మెడలో గొలుసు దొంగతనం కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు రెండో టౌన్ సీఐ ఇస్మాయిల్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ఏప్రిల్ 30వ తేది రాత్రి సమయంలో ఇంటి ముందు వాకింగ్ చేస్తున్న సత్తి పద్మావతి అనే మహిళను బెదిరించి సుమారుగా 4 తులాల తాళిబోట్టు గోలుసును బలవంతంగా లాక్కోని వెళ్లినట్లు తెలిపారు. ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ముద్దాయిలు చిటికేల ప్రాన్సిస్ బాబు అలియాస్ సంజీవ రాయుడు, యన్నం రవితేజ, కొమ్మలపాటి చార్లెస్ శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వెనుక వారిని పట్టుకుని వారి వద్ద నుంచి మోటార్ బైక్, చెక్కపిడిబాకులను స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరందరూ రుద్రవరానికి చెందినవారని సీఐ తెలిపారు. బంగారు ఆభరణాలు వేసుకుని రాత్రి సమయంలో మహిళలు ఒంటరిగా ప్రయాణం చేయడం మంచిదికాదన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అటువంటి సమయంలో 100 కాల్ చేయాలన్నారు. అలాగే శక్తియాప్ సెల్‌ఫోన్‌లో పెట్టుకుని సమాచారం ఇవ్వాలన్నారు. దీంతో మహిళలకు ఎంతో ఉపయోగం అన్నారు. నిందితులను రిమాండుకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.

## నూతన విద్యా సంస్కరణలపై రేపు నిరసన




మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

**నంద్యాల ఎడ్యుకేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి):** నూతన విద్యాసంస్కరణలను వ్యతిరేకిస్తూ సోమవారం నంద్యాల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్నట్లు ఏపీటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు రామచంద్రారెడ్డి, శివయ్య, జాకీర్‌హుశ్సేన్‌లు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలను నెలకొల్పితే, ప్రస్తుత ప్రభుత్వం 9 రకాల పాఠశాలలను ఏర్పాటు చేస్తూ ఉపాధ్యాయ నిష్పత్తిని ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. నూతన సంస్కరణలతో పాఠశాల విద్యకు నష్టం వాటిల్లుతుందని అన్నారు.

## ఆర్జిత సెలవులు ఇవ్వాలి: పీఆర్‌టీయూ



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకులు

**నంద్యాల ఎడ్యుకేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ ఉపాధ్యాయులను ఇతర ఉద్యోగుల మాదిరిగానే నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణించి 30 ఆర్జిత సెలవులు ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామఫక్కీరెడ్డి డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా వేసవి సెలవుల్లో ఫెయిల్ అయిన పదో తరగతి విద్యార్థులకు రెమిడీయల్ తరగతులు, శిక్షణా తరగతులు నిర్వహిస్తు న్నారని చెప్పారు. రకరకాల ఆన్‌లైన్ క్లాసులు పూర్తి చేయాలని, లేకపోతే వేతనాలు నిలిపివేస్తూ ఒత్తిళ్లకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## వ్యక్తి ఆత్మహత్య

**కొలిమిగుండ్ల, మే 3 ( ఆంధ్రజ్యోతి):** మండలంలో అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన చాకలిరాముడు(67) అనే వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చాకలిరాముడు గత కొంతకాలంలో మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఇంటిలో ఎవరూ లేని సమయంలో శనివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## భక్తుల సందడి



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న దుకాణాలు

**వెలుగోడు, మే 3 (ఆంధ్రజ్యోతి):** వెలుగోడు పట్టణంలోని రోఖియాబీ, ఉస్సేన్‌షావలి దర్గాల ఉరుసు సందర్భంగా వెలుగోడు పట్టణం జనసంద్రంగా మారింది. గంధం వేడుకల్లో యువత సందడి చేశారు. దర్గాలలో భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. బొమ్మలు, గాజుల కొనుగోళ్ళతో దుకాణాలు కిటకిట లాడాయి. ఆహ్లాదం, వినోదం కోసం ఏర్పాటు చేసిన ప్రాంతంలో చిన్నారులు ఆనందంగా గడుపుతున్నారు.

# డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం



పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను ఆదోనికి తరలిస్తున్న దృశ్యం

- పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడి
- ఐదు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

**ఆత్మకూరు, మే 3(ఆంధ్రజ్యోతి):** సిద్ధాపురం చెరువుకట్ట సమీపంలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం డ్రైవర్ అజాగ్రత్త వల్లే జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈమేరకు శనివారం ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, అర్బన్ సీఐ రాము సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేయగా పలు వాస్తవాలు వెలుగు చూశాయి. ఆదోని పట్టణంలోని రాయచోటి సుబ్బయ్యనగర్, ఇందిరానగర్, రాజీవ్‌గాంధీనగర్‌తో పాటు గోనెగండ్ల మండలంలోని ఎర్రబాడు గ్రామానికి చెందిన సుమారు 25 మంది బంధుమిత్రులు గురువారమే శ్రీశైలానికి బొలెరో ట్రాలీ వాహనంలో బయలుదేరి వెళ్లారు. శుక్రవారం స్వామిఅమ్మవార్ల దర్శనం పూర్తిచేసుకుని మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. అయితే మార్గమధ్యలోని నల్లమల అటవీ ప్రాంతంలో వర్షం కురవడంతో ట్రాలీలో ఎగువ భాగంలో చెక్క పలకలపై కూర్చున్న వారు తమ వెంట తెచ్చుకున్న టార్పాలిన్ కవర్‌ను కప్పేసుకున్నారు. ఈక్రమంలోనే టార్పాలిన్ కప్పేసుకోవడంతో సరిగ్గా ఊపిరి ఆడకపోవడంతో కొంతమంది ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ పరిస్థితుల్లో బైర్లూటి చెక్‌పోస్టు రాగానే వాహనాన్ని నిలిపివేసి ట్రాలీ వాహనంలో ప్రయాణిస్తున్న వారందరు కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి ఒక కిమీ వ్యవధిలోనే అతివేగంతో బొలెరో ట్రాలీ వెళ్లి సడెన్ బ్రేక్ వేయడంతో అదుపుతప్పి కుడివైపున బోల్తాపడింది. ట్రాలీలో చెక్కలపై పైభాగాన కూర్చున్నవారు కింద పడిపోగా వారిపై వాహనం పల్టీ కొట్టి తిరిగి యథాస్థితిలో నిలిచినట్లు గుర్తించారు. ఈప్రమాదంలో ఐదుగురు మృతిచెందగా మరో 15మందికి గాయాలయ్యాయి. ఓవైపు చిరు జల్లులతో కూడిన వర్షం వల్ల రోడ్డు చిత్తడిగా మారి వాహనం అదుపు తప్పే అవకాశం ఉన్నప్పటికీ వాహనాన్ని డ్రైవర్ అతివేగంతో నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులతో ఆరాతీశారు. రోడ్డు ప్రమాదం నేపథ్యంలో శ్రీశైలానికి వెళ్లే వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గూడ్స్ వాహనాల్లో ప్రయాణిస్తున్న వారిని ఆర్టీసీ బస్సులో పంపించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలకు పోలీసులు జరిమానా విధించారు.

**పోస్టుమార్టం పూర్తి:** ఘోర దుర్ఘటనలో గిడ్డయ్య (42), శశికళ (40), లక్ష్మీ (28) అక్కడికక్కడే మృతిచెందారు. చంద్రమ్మ(31) తీవ్ర గాయాలపాలై ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. అదేవిధంగా కుమార్ (17) కర్నూలులో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో ఆత్మకూరులోని నలుగురి మృతదేహాలకు ఆత్మకూరు అర్బన్, రూరల్ సీఐలు రాము, సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ నారాయణరెడ్డి నేతృత్వంలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. అదేవిధంగా కర్నూలులో మృతిచెందిన కుమార్ మృతదేహానికి నందికొట్కూరు ఎస్ఐ చంద్రశేఖర్ పర్యవేక్షణలో అక్కడి వైద్యులు పోస్టుమార్టం చేసి, బంధువులకు మృతదేహాలను అప్పగించారు.

## చికిత్స పొందుతూ బాలుడి మృతి

### ఆత్మకూరు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుకు చేరిన మృతుల సంఖ్య


కురవ కుమార్ (ఫైల్)

**గోనెగండ్ల, మే 3(ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు మండలం సిద్ధాపురం చెరువు దగ్గర శుక్రవారం జరిగి రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య శనివారం ఐదుకు చేరింది. రోడ్డు ప్రమాద ఘటనలో తీవ్రగాయాల పాలై చికిత్స పొందుతూ గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామానికి చెందిన కురువ కుమార్(15) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. దీంతో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య ఐదుకు చేరింది. వివరాలివీ.. ఎర్రబాడు గ్రామానికి చెందిన సునీల్, సునీత దంపతులు ఇద్దరు కుమారులు. సునిల్ ట్రాలీ వాహనం నడుపుతూ జీవనం సాగించేవాడు. పెద్ద కుమారుడు కుమార్ సున్నిపెంటలోని గురుకుల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. ఇటీవల పరీక్షల ఫలితాలు వెలువడటంతో ఫలితాలలో కుమార్ 514 మార్కులు సాధించాడు. ఆదోనికి చెందిన పరిచయస్థులు సునీల్ వాహనాన్ని శ్రీశైలానికి వెళ్లేందుకు బాడుగకు మాట్లాడుకున్నారు. సునీల్ తన కుమారుడు కుమార్ పదిలో మంచి మార్కులు సాధించిన సందర్భంగా తన వాహనంలో శ్రీశైలానికి తీసుకువెళ్లాడు. శ్రీశైలంలో దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో శుక్రవారం సిద్ధాపురం చెరువు దగ్గర వాహనం అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ సంఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా మరో 14మందికి తీవ్రగాయాలు అయ్యాయి. గాయాల పాలైన వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమార్ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుమార్ మృతదేహాన్ని శనివారం ఎర్రబాడు గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

## ఉర్దూ మీడియం ఎస్‌జీటీ కోసం శిక్షణ

**కర్నూలు అర్బన్, మే 3(ఆంధ్రజ్యోతి):** డీఎస్సీ ఎస్‌జీటీ ఉర్దూ మీడియం అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని రీజనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆఫ్ మైనార్టీస్ (ఆర్‌సీడీఎం) డిప్యూటీ డైరెక్టర్ సయ్యద్ సమీవుద్దిన్ ముజమ్మిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉస్మానియా కళాశాలలో నిర్వహించే ఈశిక్షణ పై ఆసక్తి ఉన్నవారు ఈనెల 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, మే 8నుంచి కళాశా లలో తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. శిక్షణకు ముస్లింలు, క్రైస్తవులు(బీసీ-సీ), సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. డీఎస్సీ -2025 ఆన్‌లైన్ దరఖాస్తు కాపీ, టీఈటీ క్యాలిఫై, ఆధార్, ఎస్సెస్సీ, ఇంటర్ జిరాక్స్, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం జిరాక్స్‌తో పాటు రెండు పాస్ పోర్టు ఫొటోలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు సెల్‌నెంబర్: 9441761178, 9849896996కు సంప్రదించాలన్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేతకు సిద్ధం: ఎమ్మెల్యే



**నంద్యాల మున్సిపాలిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి):** అహోబిలంలో అక్రమ నిర్మాణాలను కూల్చేందుకు తాను సిద్ధమని, మీరు సిద్ధమా అంటూ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు. శనివారం నంద్యాల టీడీపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. అహోబిలంలో తాను అక్రమాలకు పాల్పడుతున్నట్లు వైసీపీ అనుకూల మీడియాలో తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తన తప్పులను నిరూపిస్తే రాజీనామా చేసేందుకు తాను సిద్ధమన్నారు. గంగుల ప్రతాప్‌రెడ్డి గత ఎన్నికల్లో వైసీపీ మద్దతు ఇవ్వలేదన్న దురుద్దేశంతో తప్పుడు కథనాలు ప్రచురిస్తూ అందుకు తమను బాధ్యుల్ని చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి చౌకబారు ఆరోపణలు మానుకోవాలని వైసీపీ నాయకులకు ఆమె హితవు పలికారు. ఈ సమావేశంలో తెలుగు గంగ సాగు నీటి సంఘం చైర్మన్ సంజీవ కుమార్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కబళించిన రోడ్డు ప్రమాదం


ప్రమాద స్థలంలో పడిన మృతదేహాలు

- ఐదు నిమిషాల్లో గమ్యస్థానం..
- ఇంతలో మృత్యు ఒడిలోకి
- ఎర్రకోటలో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన గూడ్స్ వాహనం
- ఇద్దరు యువకుల దుర్మరణం

**ఎమ్మిగనూరు రూరల్/ఎమ్మిగనూరు, మే 3 (ఆంధ్రజ్యోతి):** కంటెన్నగారి కేశన్న జీవనాధారం వ్యవసాయం. ఎమ్మిగనూరు పశువుల సంతకు వారం వారం వెళ్తుంటాడు. అదే సంతలో ఎద్దుల కొమ్ములు చెక్కేడం (నునుపు చేయడం) కోసం బుక్కరాయసముద్రానికి చెందిన రజాక్ వస్తుంటాడు. ఆ క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. ఆదివారం సంత కోసం శనివారమే రజాక్ ఎమ్మిగనూరుకు వచ్చాడు. కేశన్నను కలవడంతో మా ఊరు కడిమెట్లకు వెళ్లివద్దాం రా..! అంటూ ఇద్దరు మోటర్‌బైక్‌పై కడిమెట్లకు బయలుదేరి ఎర్రకోట సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. మరో ఐదారు నిమిషాలు ఉంటే గమ్యస్థానికి చేరుకొని ఉండేవారు. ఇంతలో ఘోరం జరిగిపోయింది. కర్నూలు వైపు నుంచి ఎమ్మిగనూరుకు వస్తున్న సరుకులు రవాణా చేసే అశోక్ లైలాండ్ మినీ వాహనం వారు వెళ్తున్న మోటర్ బైక్‌ను ఢీకొట్టడడంతో ఇద్దరు మిత్రులు దుర్మరణం పాలయ్యారు. బోయ కేశన్న(32), రజాక్(35) విగతజీవులుగా రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. రాజక్ తల తెగిపోయి దూరంగా పడిపోయింది.

ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల గ్రామానికి చెందిన కుంటెన్నగారి కేశన్న వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పది ఎకరాల పొలం ఉంది. కేశన్నకు భార్య శారద, కూతుళ్లు అమృత (9ఏళ్లు), అంకిత (7ఏళ్లు), కుమారుడు హరికృష్ణ (6ఏళ్లు) సంతానం. కేశన్నకు జత కాడెద్దులు ఉన్నాయి. ఎద్దుల ద్వారా పొలంలో సేద్యం పనులు చూస్తూనే.. ఖాళీ సమయంలో ఇతర రైతుల పొలాలకు దుక్కుల కోసం బాడుగకు వెళ్తుతూ జీవనం సాగిస్తున్నారు. శనివారం కేశన్న ఎమ్మిగనూరుకు వెళ్లాడు. అదే సమయంలో అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన రజాక్ ఆదివారం పశుల సంతలో ఎద్దుల కొమ్మలు చెక్కేందుకు వచ్చారు. ఆ పనే ఆయనకు జీవనాధారం. వారం వారం వస్తుండడంతో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతోనే రజాక్‌ను తన మోటర్‌బైక్‌పై ఎక్కించుకొని కడిమెట్లకు బయలుదేరారు. ఎర్రకోట గ్రామ శివారులో విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి కడిమెట్లకు మూడు నాలుగు కిలోమీటర్లు కూడా లేదు. నాలుగైదు నిమిషాల్లో గమ్యస్థానానికి చేరుకునే వారు. ఇంతలో కర్నూలు నుంచి ఎమ్మిగనూరు పట్టణానికి మద్యం లోడ్‌తో వస్తున్న సరుకుల రవాణా చేసే ఏపీ39 యూ 4952 నంబరు గల అశోక్ లైలాండ్ మినీ వాహనం కేశన్న, రజాక్ వెళ్తున్న ఏపీ04 ఏవీ 1388 నంబరు గల ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. కనురెప్పపాటులో ఇద్దరు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. వాహనాలు బలంగా ఢీకొట్టడంతో బైక్‌పై ఎనుక కూర్చున్న రజాక్ తల తెగిపడి మొండానికి దూరంగా పడిపోయింది. కేశన్న రక్తపు మడుగులో అక్కడే కుప్పకూలి మృతి చెందారు. విషయం తెలియగానే కేశన్న భార్య పిల్లలు, బంధువులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహం చూసి కన్నీరుమున్నీరై విలపించారు. తండ్రిని ఆస్థితిలో చూసిన చిన్నారులు రోధిస్తుంటే అయ్యో.. పాపం..! దేవుడా... ఎంత అన్యాయం చేశావయ్యా... అంటూ అక్కడివారు కంటితడి పెట్టారు. ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

## చెత్తకుప్పలో శిశువు మృతదేహం

**కోడుమూరు, మే 3(ఆంధ్రజ్యోతి):** చెత్తకుప్పలో చిన్నారి మృతదేహాన్ని పడేసిన హృదయ విదారక ఘటన కోడుమూరులో చోటుచేసుకుంది. పట్టణంలోని సంత మార్కెట్‌లోని ప్రాథమిక పాఠశాల సమీపంలో నెలలు నిండని మగ మృత శిశువును చెత్తకుప్పలో పడేశారు. శనివారం సంత కావడంతో ఆశిశువును చూసేందుకు జనం బారులు దీరారు. మృత శిశువును ఖననం చేకుండా ఇలా చెత్తకుప్పలో వేయడంపై ప్రజలు విమర్శలు కురిపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలి చేరుకొని మృత శిశువును స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పంచానామా చేయించి మృత శిశువును ఖననం చేస్తామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నారు.

## గడ్డివామి పడి బాలుడి మృతి

**తుగ్గలి, మే 3 (ఆంధ్రజ్యోతి):** పశువులకు మేత వేసేందుకు వెళ్లి గడ్డివామి మీద పడటంతో బాలుడు రమేష్ (13) శనివారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన మేరకు.. మండలంలోని రాంపల్లి గామానికి చెందిన రామాంజనేయులు, సరస్వతి దంపతుల కుమారుడు రమేష్ పెండేకల్ ఆర్ఎస్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. కల్లంలో పశువులకు మేత వేసేందుకు గడ్డిని తీస్తుండగా గడ్డివామి మీదపడి, శ్వాస ఆడక పడిపోయాడు. తల్లిదండ్రులు గడ్డివామి వద్దకు వెళ్లి చూడగా బాలుడు కనిపించలేదు. గడ్డిని తొలగించి చూసేసరికి అప్పటికే విగత జీవిగా పడిఉన్నాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు భోరున విలపించారు. టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, రాంపల్లి శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## లక్ష్మీపురంలో చైన్ స్నాచింగ్

### లాక్కుని పరారైన ఆటో డ్రైవర్

**కర్నూలు క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి):** ఒంటరిగా ఉన్న మహిళ మెడలో ఉన్న గొలుసును చోరీచేసి, ఆమెను ఆటోలో నుంచి తోసేసి ఓ ఆటో డ్రైవర్ పరారైన ఘటన లక్ష్మీపురం సమీపంలో చోటుచేసుకున్నట్లు ఉలిందకొండ పోలీసులు తెలిపారు. వివరాలు.. స్థానిక బిర్లాగేటు ప్రాంతానికి చెందిన మాలతి అనే మహిళ ఉద్యోగం కోసం జగన్నాథగట్టు సమీపంలో ఉన్న రిడ్జ్ స్కూలుకు వెళ్లాలని బిర్లాగేటు వద్ద ఆటో ఎక్కింది. లక్ష్మీపురం సమీపంలో ఆటోడ్రైవర్ ఆమె ఒంటరిగా వచ్చిందని గుర్తించాడు. ఆమె మెడలో గొలుసు లాక్కుని ఆమెను ఆటోలో నుంచి తోసేసి పరారయ్యాడు. బాధితురాలుకు ఏంచేయాలో అర్థంకాక తమ బంధువులకు సమాచారమిచ్చింది. వారు అక్కడికి చేరుకొని ఉలిందకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. అపహరణకు గురైన గొలుసు బరువు రెండున్నర తులాలు ఉంటుందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.

## పెద్దగుండంలో విద్యార్థి గల్లంతు

**బేతంచెర్ల, మే 3 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన మద్దిలేటి స్వామి క్షేత్రంలో ఉన్న పెద్దగుండంలో శనివారం ఈతకు వెళ్లి జాలకంటి మణిధర్(14) అనే విద్యార్థి గల్లంతయ్యాడు. అంబాపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు, పుల్లమ్మ దంపతుల కుమారుడు మణిధర్ జూపాడుబంగ్లా ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవులు కావడంతో గ్రామానికి వచ్చిన మణిధర్ తమ బంధువులు మద్దిలేటిస్వామి కార్యక్రమానికి తల్లిదండ్రులతో కలిసి హాజరయ్యాడు. అయితే స్నానానికి శనివారం ఉదయం తన బంధువులు, పిల్లలతో కలిసి స్నానం చేసేందుకు పెద్దగుండం దగ్గరకు వెళ్లాడు. మణిధర్‌తో పాటు స్నానానికి వెళ్లిన పిల్లలు తిరిగి వచ్చారు. మణిధర్ రాకపోవడంతో పెద్దగుండంలో గల్లంతైనట్లు తోటి వారు చెప్పడంతో గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

# షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు


కాలిపోయిన ఇళ్లు

- ఇంట్లోని పట్టుచీరలు, 8 తులాల బంగారు, 20 తులాల వెండి అగ్గిపాలు

**రుద్రవరం, మే 3 (ఆంధ్రజ్యోతి):** రుద్రవరంలో శుక్రవారం రాత్రి ఒక్కసారిగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. బాధితుడు పూజారి విశ్వనాథశర్మ తెలిపిన వివరాలివీ.. కుటుంబ సభ్యులంతా కింది పోర్షన్‌లో ఉండగా మొదటి అంతస్తులో అగ్నిప్రమాదం జరిగింది. మొదటి అంతస్తులో ఉన్న బీరువాలో ఉన్న వంద పట్టుచీరలు, 8 తులాల బంగారం, 20 తులాల వెండి ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయి. కుటుంబ సభ్యులమంతా కింద ఉండడంతో ప్రాణ నష్టం జరగకుండా తప్పింది. గృహమంతా కాలిబూడిదైందన్నారు. అగ్ని ప్రమాదంలో కష్టపడి కూటబెట్టుకున్న సొమ్ములు కాలిబూడిదయ్యాయన్నారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు కోరారు. ఆళ్లగడ్డ గ్నిమాపక దళ సిబ్బంది గ్రామాన్ని చేరుకుని మంటలు అదుపు చేసింది. ప్రమాదం తృటిలో తప్పింది. భవనమంతా కాలిపోయి పొగ బట్టింది. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.20లక్షలు ఆస్తినష్టం సంభవించించిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

# దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం

- రూ.70 లక్షల ఆస్తి నష్టం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

**డోన్ టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని కంబలపాడు సర్కిల్ సమీపంలో ఉన్న గురు రాఘవేంద్ర ఎలక్ట్రానిక్ షాపులో ఉదయం 4 గంటల ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్‌తో రూ.70 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని యజమాని తెలిపారు. శనివారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలు ఆర్పేందుకు 6గంటల పాటు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ బాలరాజు, డోన్ ఫైర్ ఆఫీసర్ రంగస్వామి గౌడు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది రాజశేఖర్, హరిప్రసాద్, రంగస్వామి, గౌరి శంకర్ మంటలను అదుపు చేశారు. ఈ అదుపులో గురు రాఘవేంద్ర ఎలక్ట్రానిక్ షాపులో మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి. షాపు యజమాని వివరాల మేరకు షార్ట్ సర్క్యూట్‌తో షాపులోని వస్తువులు రూ.50లక్షలు, బిల్డింగ్ రూ.20 లక్షలు మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## గోనెగండ్లలో రెండిళ్లలో చోరీ

**గోనెగండ్ల, మే 3(ఆంధ్రజ్యోతి):** గోనెగండ్లలో శనివారం పట్టపగలు రెండిళ్లలో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. మొట్టి వీదిలోని పిసారి ఉస్మాన్ ఇంటి తలుపులకు ఉన్న తాళాలు పగల గొట్టి ఇంట్లోకి వెళ్లి బీరువా ను పగల గొట్టి చోరీకి పాల్పడ్డారు. అలాగే మైనార్టీ కాలనీలో షాలి ఇంట్లో కూడా దొంగలు చొరబడ్డారు. బీరువాను పగల గొట్టి అందులో బంగారు, వెండి కోసం వెతికారు అలాగే ఇంట్లో అంతా వెతికారు. అక్కడ మేమి దొంగలకు విలువైన వస్తువులు దొరక్క పోవడం తో బీరువాలో ఉన్న దుస్తులను బయట పారవేసి దొంగలు పారిపోయారు. అయితే మొట్టి వీదిలోని పిసారి ఉస్మాన్ కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోతమ బంధువుల ఇంట్లో జరుగుతున్న కార్యక్రమానికి వెళ్లేందుకు శనివారం మధ్యాహ్నం 12, ఒంటి గంట సమయంలో పిసారి ఉస్మాన్‌తో పాటు ఆయన భార్య, ఇంట్లో ఉన్న ఇతర కుటుంబ సభ్యులను ఉస్మాన్ కుమారుడు బాషా బస్టాండ్‌కు తీసుకువెళ్లి హైదరాబాద్‌కు వెళ్లే ప్రత్యేక వాహనంలో ఎక్కించి రెండు గంటలలోపు ఇంటి వచ్చాడు. అప్పటికే ఇంటి తలుపులు పగల గొట్టి ఉండటంతో బాషా ఇంట్లో వెళ్లి చూశారు. అప్పటికే బీరవాను పగలగొట్టి అందులో ఉన్న మూడు తులాల బంగారు, 50 తులాల వెండి, లక్ష రూపాయల నగదును ఎత్తుకెళ్లారు. ఇంట్లో చోరీ జరిగట్లు తన తండ్రి పిసారి ఉస్మాన్‌కు ఫోన్ చేసి కుమారుడు తెలపడంతో వెనుతిరిగి గోనెగండ్లకు వచ్చారు. ఇంట్లో ఎంత బంగారు, వెండి, నగదు పోయిందో లెక్కలు వేసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే దొంగలు చాకచక్యంగా ఇంట్లోని నేల బండలపై నూనె పోసి వెళ్లారు. గంట వ్యవధిలో రెండు ఇండ్లలో చోరీకి దొంగలు ప్రయత్నించారు. బాధితుడు పిసారి ఉస్మాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు.


మైనార్టీ కాలనీలో ఓ ఇంట్లో దొంగలు బీరువాను పగల గొట్టి దుస్తులను పారవేసిన దృశ్యం

4 ఆంధ్రజ్యోతి నవ్య కుటుంబ కదంబం 4 మే 2025 ఆదివారం








37 మంది హీరోలతో సినిమాలు తీసి అత్యధిక హిట్స్ ఇచ్చిన ఏకైక దర్శకుడు ఆయన ఒక్కరే. అలాగే 77 మంది హీరోయిన్లతో చిత్రాలు తీసిన ఘనత ఇండియాలో రాఘవేంద్రరావుకు మాత్రమే సొంతం.

### ఇప్పుడు తీరికే లేదు



'పెళ్లిసందడి' చిత్రం మళ్లీ తీసిన తర్వాత ఏం చేయాలా అని నాకు తోచలేదు. ఇన్ని సంవత్సరాలు వర్క్ చేసిన తర్వాత న్యాయంగా అయితే రిటైర్ అవ్వాలి, కానీ నాకు పని లేకపోతే తోచదు. అప్పుడు బాగా ఆలోచించి యూ ట్యూబ్ ఛానల్ స్టార్ట్ చేశా. షార్ట్ ఫిల్మ్స్ తీసి అప్‌లోడ్ చేస్తున్నా. పిల్లలకు సంబంధించి రెండేసి నిముషాల షార్ట్ ఫిల్మ్స్ ఏ.ఐ.లో తీస్తున్నాం. దానికోసం తీరిక లేకుండా వర్క్ చేస్తున్నా. కీ బోర్డ్ నేర్చుకుంటున్నా. అలాగే 'కెఆర్ఆర్ క్లాస్‌రూమ్' పేరుతో సినిమాల గురించి ప్రాక్టికల్ నాలెడ్జిని ఔత్సాహికులకు ఉచితంగా చెబుతున్నా.

# నేను రుణపడేది ఆయనకే!

**తెలుగు సినిమాకు మాస్ హంగులు అద్ది, బాక్సాఫీసును షేక్ చేసిన దర్శకుడు... తెలుగు పాటను రంగులతో అభిషేకించి, సంగీతంతో సంబరాలు చేయించిన సంగీతాభిమాని. హిట్స్, రికార్డ్ బ్రేక్ కలెక్షన్లు, సిల్వర్ జూబ్లీలు, పొగడ్తలు... ఇలా అన్నీ కట్టకట్టుకువచ్చి మీదపడినా.. అన్నిటినీ చిరునవ్వుతో స్వీకరించడం తప్ప, స్టేజ్ మీద కానీ, మరెక్కడైనా కాని అహంకారంతో ఎప్పుడూ ఆయన మాట్లాడలేదు... 'గ్లామర్, గుట్టల గుట్టల పండ్లు, నాయికల నాభి తప్ప... అంతకంటే ఏం తియ్యగలడు' అనే వాళ్లకు 'అన్నమయ్య' అనే అద్భుతాన్ని అందించి తన ప్రతిభను పండించుకున్న ఆ దర్శకుడు... కె. రాఘవేంద్రరావు. యాభై ఏళ్ల కెరీర్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆ దర్శకేంద్రుడు తన సినీ పయనంలో ఎదురైన ఆసక్తికరమైన సంఘటనలను, విశేషాలను 'నవ్య'కు వివరించారిలా...**



మీరందరూ యాభై ఏళ్లు అయిందని చెబుతుంటే ఆనందంగా ఉంది. నిజం చెప్పాలంటే 'పరిశ్రమలోకి వచ్చి ఇన్నేళ్లు అయింది, ఇన్ని సినిమాలు చేశాను' అని నేను ఎప్పుడూ లెక్క పెట్టుకోలేదు. నా పని నేను చేశాను. 'వెయ్యి కోట్ల రూపాయలు కావాలా, డైరెక్షన్ ఛాన్స్ కావాలా?' అని ఎవరైనా ఆఫర్ ఇస్తే... ఇప్పటికీ దర్శకత్వాన్నే కోరుకుంటా. డైరెక్షన్ అంటే నాకు అంత పిచ్చి. ఇన్నేళ్ల నా కెరీర్‌లో ఒకే ఒక వ్యక్తికి రుణపడి ఉంటాను. ఆయనే ఎన్టీఆర్. 'పాండవ వనవాసం' చిత్రంతో పరిశ్రమలోకి ప్రవేశించి, రామారావుగారి మీద తొలి క్లాప్ ఇచ్చాను. అలాగే ఆయన నటించిన 'అడవిరాముడు' సినిమా నుంచే అగ్ర దర్శకుడిగా ఎదిగాను. ఆ రోజు రామారావుగారి మీద క్లాప్ ఇచ్చిన తర్వాత ప్రేక్షకులు ఇన్నేళ్లుగా నా సినిమాలు చూస్తూ ఇన్ని క్లాప్స్ కొడతారని ఊహించలేదు. సినిమా పాటకు ప్రేక్షకులు పట్టాభిషేకం చేసిన సినిమా 'అడవిరాముడు'. రామారావుగారు నడిచి వస్తుంటే ఆ రోజుల్లో జనం పూలు జల్లేవారు, హారతులు ఇచ్చేవారు. 'ఆయన నడిచి వస్తేనే ఇలా చేస్తున్నారు, ఏనుగు ఎక్కిస్తే ఇంకెంత ఆనందిస్తారో?' అని అడవిరాముడు తీశాను. ఆ సినిమాలోని 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను' పాట చూసి జనం డబ్బులు విసరడం మొదలుపెట్టారు. అప్పటినుంచి మా కాంబినేషన్‌కు క్రేజ్ మొదలైంది. అలాగే నిర్మాతలు లేకపోతే నేను లేను. ఈ యాభై ఏళ్ల జర్నీ ఇంత విజయవంతంగా సాగడానికి నా నిర్మాతలే కారణం. నాతో పని చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు, పంపిణీదారులకు, థియేటర్ యజమానులకు, నన్ను ఆదరించిన ప్రేక్షకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు.

**• హీరో కావాలని అనుకోలేదు**

నాకు సినిమాలు అంటే చాలా చాలా ఇష్టం. పుస్తకాలు కొనుక్కోమని ఇంట్లో డబ్బులు ఇస్తే అవి కొనకుండా సినిమాలకు వెళ్లి, స్నేహితుల పుస్తకాలు చదివిన రోజులు ఉన్నాయి. దాదాపు ప్రతి రోజూ సినిమా చూసిన సందర్భాలు ఉన్నాయి. నాకు మొదటి నుంచీ నటన మీద ఆసక్తి లేదు. దర్శకుడినవ్వాలనేదే నా కోరిక. నటుడినో, హీరోనో కావాలని ఎప్పుడూ అనుకోలేదు.

**• లక్ష రూపాయలతో తొలి సినిమా అనుకున్నా**

ఎన్టీఆర్, కృష్ణ తొలిసారిగా కలసి నటించిన 'స్త్రీ జన్మ' చిత్రానికి నాన్నగారు దర్శకుడు. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌ని. సెట్‌లో నా ఇన్‌వాల్వ్‌మెంట్, పనితీరు గమనించిన ఆ చిత్ర నిర్మాత రామానాయుడు గారు "రాఘవేంద్రరావ్.. నీ ఫస్ట్ పిక్చర్ నాకే చెయ్యాలి" అనేవారు. "ఇప్పుడు కాదు.. తర్వాత చూద్దాంలే" అన్నారు నాన్నగారు. ఆ తర్వాత నా ఫ్రెండ్స్ ఏవీఎం సీజర్, అడుసుమిల్లి కుమార్, గోపాలకృష్ణ కలసి నా దర్శకత్వంలో సినిమా తీద్దామని వచ్చారు. "ఎవరూ చేయని విధంగా సినిమా తీద్దాం. పల్లెటూరికి వెళ్దాం. లక్ష రూపాయల బడ్జెట్‌లో తీద్దాం" అన్నాను. "లేదు లేదు భారీ బడ్జెట్‌లో తీద్దాం" అన్నారు వాళ్లు. 'బాబు' సినిమాకు మా నాన్న కథ ఇచ్చారు. శోభన్‌బాబు హీరో. ముగ్గురు హీరోయిన్లు. చాలా భారీగా తీశాం. నాకు తొలి అవకాశం ఇచ్చిన ఆ ముగ్గురు మిత్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు. సినిమాకు మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. అయితే మా సినిమా విడుదలైన కొన్ని రోజులకు విశ్వనాథ్‌గారి 'జీవనజ్యోతి' రిలీజ్ అయింది. ఆ చిత్రం చూడగానే నా సినిమా భవిష్యత్ అర్థమై పోయింది. ఊహించినట్లుగానే 'జీవనజ్యోతి' వచ్చాక మా సినిమా వసూళ్లు తగ్గాయి.

**• మూడు తరాల హీరోలతో...**

నేను నిర్మాతల దర్శకుణ్ణి. ఎక్కువ రోజులు షూటింగ్ చేసి నిర్మాతను ఇబ్బంది పెట్టలేదు. అందుకే ఒక్కో నిర్మాతకు చాలా సినిమాలు చేసే అవకాశం కలిగింది. నా అదృష్టం ఏమిటంటే.. నా దర్శకత్వంలో నటించడానికి ఏ హీరోకానీ, నటుడు కానీ 'నో' అనలేదు. మూడు తరాల హీరోలతో పని చేశాను. అందరికీ గుర్తుండిపోయే హిట్స్ ఇచ్చే అవకాశం దక్కడం నా అదృష్టం.

**• ఆ టెన్షన్ ఉండేది**

రామారావుగారు ఒక సినిమా కోసం దాదాపు 40 రోజుల పాటు ఔట్‌డోర్‌లో ఉండడం అన్నది 'అడవిరాముడు'తోనే మొదలు. అంతవరకూ ఆయనకు ఔట్‌డోర్ అంటే మద్రాసు గిండీ ఫారెస్టే. అటువంటి వ్యక్తి ఈ చిత్రకథ నచ్చి అన్ని రోజులు ఔట్‌డోర్‌లో ఉండిపోయారు. మధ్యలో ఒకటి రెండు సార్లు 'దానవీరశూర కర్ణ' చిత్రం రీరికార్డింగ్ కోసం మద్రాసు వెళ్లి వచ్చారేమో! 'ఈ సినిమా ఆడకపోతే నా కెరీర్ ఏమవుతుందా?' అనే టెన్షన్ 'అడవిరాముడు' చేస్తున్నప్పుడు నాకు ఉండేది. చిన్న సినిమాలు చేసుకోవచ్చు కానీ రామారావుగారు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టుదలతో పని చేశాను. రామారావుగారు షూటింగ్ ముగించుకుని వెళ్లిపోతూ "నా కెరీర్‌లో ఇది మధుర జ్ఞాపకం' అని మెచ్చుకోవడం మరిచిపోలేని సంఘటన. ఫెయిల్యూర్స్ వచ్చినప్పుడు కూడా నా హీరోలు ఎన్టీఆర్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్... ఎవరూ నిరుత్సాహపరిచేలా మాట్లాడలేదు. నాకు ఎంతో సపోర్ట్ ఇచ్చారు. అది వారి గొప్పతనం. ముఖ్యంగా రామారావుగారు. ఆయనకు 'సింహబలుడు', 'తిరుగులేని మనిషి' అని రెండు ఫ్లాప్స్ ఇచ్చాను. ఆయన వద్దు అనుకుంటే నాకు మరో అవకాశం వచ్చేది కాదు.. కానీ ఆయన గొప్పతనం ఏమిటంటే.. "ఇట్సాల్ రైట్ బ్రదర్.. ఏం తీయకూడదో నేర్చుకున్నాం. ఈ సారి మంచి కథతో ప్లాన్ చేయండి..' అన్నారు., ఆయన ఆఖరి చిత్రం 'మేజర్ చంద్రకాంత్' చేసే అవకాశం నాకు దక్కడం నా అదృష్టం. అందుకే ఏ ఫంక్షన్‌కు వెళ్లినా "రామారావుగారి వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను" అని చెబుతుంటాను.

**• సోషల్ మీడియాను కంట్రోల్ చెయ్యాలి**

సోషల్ మీడియాను కంట్రోల్ చేసే పరిస్థితి రావాలి. ముఖ్యంగా కొన్ని యూ ట్యూబ్ ఛానల్స్ పెట్టే హెడ్డింగ్స్ ఇబ్బందికరంగా ఉంటున్నాయి. వాటిని అదుపు చేయాలి. ఈ విషయంలో నేను కూడా ఓసారి ఇబ్బంది ఎదుర్కొన్నా. అయితే వాటిని నేను పట్టించుకోను కనుక రియాక్ట్ కాలేదు. కానీ రాను రాను విచ్చలవిడితనం పెరిగిపోతోంది.

**• పాటలో మొత్తం రామాయణం**

నా కెరీర్‌లో అన్ని రకాల చిత్రాలూ చేశాను. 'అన్నమయ్య', 'శ్రీరామదాసు', 'పాండురంగడు', 'మంజునాథ' 'శిరిడి', 'నమో వేంకటేశ' లాంటి సినిమాలు చేశాను. ఇప్పుడు ఓ పాటలో మొత్తం రామాయణాన్ని చూపించాలని నా కోరిక . దానికి సంబంధించిన టెస్ట్ షూట్ కూడా చేశా. అలాగే 'వల్లీ కల్యాణం' కూడా సినిమాగా తీయాలనే ఆలోచన ఉంది.

• వినాయకరావు

### 28 రోజుల్లో 'జ్యోతి'



ఒక పెద్ద సినిమా తీసిన వెంటనే ఓ చిన్న చిత్రం తీయడం చాలా మంచిది. ఆ పద్ధతిని చాలా రోజులు కొనసాగించా. ప్రేక్షకులు అంచనాలు పెంచుకునే అవకాశం ఇవ్వకూడదు. ఎందుకంటే 'ఏం తీస్తాడు, ఎలా తీస్తాడు...' అని వారంతా ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. అందుకే రెండో సినిమా 'జ్యోతి'ని ప్రయోగాత్మకంగా 28 రోజుల్లో తీశాను. మురళీమోహన్, జయసుధ జంటగా నటించారు. ఆ సినిమా మంచి విజయం సాధించింది. మురళీమోహన్‌తో చేసిన 'కల్పన' చిత్రం విడుదల అయిన వారం రోజులకు 'అడవిరాముడు' వచ్చింది. ఈ రెండు సినిమాలూ హిట్ అయ్యాయి. అలాగే 'సింహబలుడు' చిత్రం భారీ బడ్జెట్‌తో తయారైతే, ఆ సమయంలోనే 'పదహారేళ్ల వయసు' చిత్రం లోబడ్జెట్‌తో వచ్చింది.

### మరచిపోలేని మూడు సంఘటనలు



యాభై ఏళ్ల కెరీర్‌లో మరచిపోలేని మధుర సంఘటనలు మూడు ఉన్నాయి. 'అడవిరాముడు' చిత్రంతోనే పాటలు వచ్చినప్పుడు తెరపైకి డబ్బులు విసరడం అనే ట్రెండ్ మొదలైంది. అలాగే 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' చిత్రం పెద్ద తుపాన్ వచ్చిన సమయంలో విడుదల అయింది. చాలా థియేటర్లలో షోలు పడని పరిస్థితి. కానీ ఒక థియేటర్‌లో మాత్రం వర్షపు నీటిని మోటార్లు పెట్టి బయటకు తోడేస్తుంటే, జనం కుర్చీలో కాళ్లు పెట్టుకుని ఆ సినిమా చూశారు. 'అన్నమయ్య' చిత్రంలో 'మోకాళ్ల పర్వతాన్ని చెప్పులు వేసుకుని ఎక్కకూడదు' అని భానుప్రియ నాగార్జునకు చెప్పే సీన్ వచ్చినప్పుడు థియేటర్‌లో ప్రేక్షకులు కూడా చెప్పులు విడిచిపెట్టి సినిమా చూశారు.

### ముగ్గురు హీరోలతో 'త్రివేణి సంగమం'



నా నూరవ సినిమాను మొదట చాలా విభిన్నంగా ప్లాన్ చేశాను. చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్‌లతో ఆ సినిమా చేయాలని అనుకొని వారిని అడిగాను. ముగ్గురూ ఒప్పుకొన్నారు. 'త్రివేణి సంగమం' అని టైటిల్ అనుకున్నా. ఈ సినిమాను అరవింద్, అశ్వనీదత్‌లతో కలసి తీయాలిన ప్లాన్ చేశా. అయితే పాటల విషయంలో అభిమానుల మధ్య అభిప్రాయ బేధాలు వస్తాయేమో అనే అనుమానం వచ్చి ఆ ప్రాజెక్ట్ ఆపేశాం. అప్పుడు ఓ కొత్త హీరోతో చిన్న సినిమా తీద్దామని అల్లు అర్జున్‌ను పరిచయం చేస్తూ 'గంగోత్రి' తీశాం.

### ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీలో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

| ఓటీటీ వేదిక | సినిమా/సిరీస్ | విడుదల తేదీ |
|---|---|---|
| నెట్‌ఫ్లిక్స్ | THE DIPLOMAT | |
| ది డిప్లొమాట్ | హిందీ చిత్రం | మే 09 |
| గుడ్ బ్యాడ్ అగ్లీ | తమిళ చిత్రం | మే 08 |
| ది రాయల్స్ | హిందీ సిరీస్ | మే 09 |
| అమెజాన్ ప్రైమ్ | Royals | |
| గ్రామ్ చికిత్సాలయ్ | హిందీ చిత్రం | మే 09 |
| జియో హాట్‌స్టార్ | | |
| స్టార్‌వార్స్ | యానిమేషన్ సిరీస్ | మే 04 |

### వినోదాత్మక చికిత్స

ఓ మారుమూల పల్లెలో ప్రభుత్వ ఆస్పత్రి నేపథ్యంలో తెరకెక్కిన హిందీ సిరీస్ 'గ్రామ్ చికిత్సాలయ్'. అక్కడి వసతుల లేమి, వైద్యుల నిర్లక్ష్యంతో అమాయక గ్రామీణులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ వారి చేతుల్లో దోపిడీకి గురవుతుంటారు. ఈ పరిస్థితుల్లో బదిలీపై ఆ గ్రామానికి వచ్చిన ప్రతిభావంతుడైన యువ వైద్యుడు ప్రభాత్ ఆ పరిస్థితులను మార్చాలని కంకణం కట్టుకుంటాడు. ఆ నేపథ్యంలో అతనికి ఎదురైన సవాళ్లు ఏమిటి, ప్రజలు అతనికి సహకరించారా అనేది వినోదాత్మకంగా ఈ సిరీస్‌లో ఆవిష్కరించారు. అమోల్ పరాశర్ వినయ్ పాఠక్, ఆకాంక్ష రంజన్ కీలకపాత్రలు పోషించారు. రాహుల్ పాండే దర్శకుడు.




### బియ్యం నీళ్లు చేసే అద్భుతం..!

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ... శిరోజాలు రాలడం, అవి నిర్జీవంగా మారడం, వాటి చివర్లు చిట్లడం, చుండ్రు లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిని నివారించేందుకు బియ్యం నీళ్లు అద్భుతంగా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**ఇలా తయారు చేసుకోవాలి...**

- ఒక గిన్నెలో ఒక కప్పు బియ్యాన్ని తీసుకుని శుభ్రంగా కడగాలి. వెంటనే రెండు కప్పుల నీళ్లు పోసి అరగంటసేపు నానబెట్టాలి. తరవాత ఈ నీటిని మరో గిన్నెలోకి వడకట్టాలి.
- బియ్యాన్ని నీటిలో రెండు రోజులు నానబెడితే ఆ నీటిని 'ఫెర్మెంటెడ్ వాటర్' అంటారు. ఈ నీళ్లు మాడుకు, శిరోజాలకు అదనపు ప్రయోజనాలను అందిస్తాయి. ఫెర్మెంటెడ్ వాటర్‌ను ఫ్రిజ్‌లో వారంపాటు నిల్వ చేసుకోవచ్చు.
- బియ్యం నీటిలో లావెండర్ లేదా రోజ్‌మేరీ ఆయిల్ చుక్కలు వేసుకుంటే ఫలితం బాగుంటుంది.
- బియ్యం నీళ్లలో బి, ఇ విటమిన్లతోపాటు మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.



**ఇలా వాడాలి...**

- ముందుగా శిరోజాలను కుంకుళ్లు లేదా గాఢత తక్కువగా ఉన్న షాంపూతో శుభ్రం చేసుకోవాలి. తలను కొద్దిగా ఆరనివ్వాలి. తరవాత బియ్యం నీటిని చేత్తో తీసుకుంటూ కురులకు, మాడుకు పట్టించాలి. బియ్యం నీటిని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి తలంతా చిలకరించుకోవచ్చు. అయిదు నిమిషాల తరవాత తలను వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. పావుగంటసేపు ఆరనిచ్చి మంచినీళ్లతో తలను శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే శిరోజాలు ఒత్తుగా పెరుగుతాయి.

### విమానం ఎక్కేముందు...

విమానం ఎక్కేముందు కొన్ని రకాల ఆహార పదార్థాలు తినకపోవడమే మంచిదనీ లేదంటే ప్రయాణంలో అనారోగ్య సమస్యలు తప్పవనీ నిపుణులు చెబుతున్నారు.

- సాధారణంగా అల్పాహారం కింద బ్రోకలీ, క్యాబేజీ తురుము, వెనిగర్ వేసి తయారు చేసిన సలాడ్స్ తీసుకుంటూ ఉంటారు. వీటివల్ల గ్యాస్ చేరి కడుపు ఉబ్బరిస్తుంది. ఉదయం వేళ విమాన ప్రయాణం చేయాల్సి ఉంటే వీటిని తినకపోవడమే మంచిది.
- విమానం ఎక్కడానికి ఒక రోజు ముందు నుంచి బీన్స్, పప్పు దినుసులు తినకూడదు. ఇవి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి విమానం ఎక్కగానే కడుపులో సమస్యలు ఏర్పడవచ్చు.
- నూనె పదార్థాలు, వేపుళ్లు, చిప్స్, వీధుల్లో అమ్మే పదార్థాలు తినకూడదు. వీటివల్ల కడుపులో వికారం, వాంతులు, తలనొప్పి లాంటి ఆరోగ్య సమస్యలు రావచ్చు.
- విమానం ఎక్కడానికి గంట ముందు నుంచి కార్బొనేటెడ్ డ్రింక్స్, ఆల్కహాల్ తీసుకోకూడదు. వీటివల్ల కడుపులో తిప్పడం, తల తిరగడం, తేన్పులు, కడుపు ఉబ్బరించడం లాంటివి ఏర్పడవచ్చు. సరిగా నిద్ర పట్టక అలసటగా అనిపిస్తుంది.
- కొంతమందికి చూయింగ్ గమ్ నమలడం, క్యాండీస్ తినడం అలవాటుగా ఉంటుంది. వీటివల్ల కూడా సమస్యలు ఏర్పడవచ్చు.
- విమానం ఎక్కేముందు కారంగా ఉన్నవి, మసాలాలు చేర్చిన ఆహార పదార్థాలు తినకూడదు. వీటి వల్ల గుండెలో మంటగా అనిపిస్తుంది.



# అద్భుతమైన మహిళల కోసం

**నూట తొంభై ఐదు దేశాలు... పది లక్షలమంది మహిళలు... వారి జీవన స్థితిగతులు... 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' పేరుతో మహత్తర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు... విశాఖకు చెందిన భరద్వాజ్ దయాల. వివిధ దేశాల్లో విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళల జీవితాలను ప్రతిబింబిస్తూ ఒక డాక్యుమెంటరీ రూపొందిస్తున్నారు. ఏడాదిన్నరలో బైక్‌పై ఐదు ఖండాలు, 16 దేశాలు చుట్టివచ్చిన ఆయన... 'నవ్య'తో ఆ విశేషాలు పంచుకున్నారు.**




"సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం. భారీ జీతం. కానీ జీవితమంటే సంపాదన మాత్రమే కాదని కొన్నేళ్ల ఉద్యోగ జీవితం తరువాత అనిపించింది. దానికితోడు కొత్తగా ఏదైనా చేయాలన్న తపన నన్ను కుదురుగా కూర్చోనివ్వలేదు. దాంతో 2006లో బైక్‌పై ప్రపంచ యాత్రకు శ్రీకారం చుట్టాను.

ఐదు ఖండాల్లోని 16 దేశాల మీదుగా 48 వేల కిలోమీటర్లు ప్రయాణించాను. ఏడాదిన్నరపాటు సాగింది ఈ యాత్ర. బైక్‌పై ప్రపంచ యాత్ర పూర్తి చేసిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందాను. ఆ యాత్ర విశాఖలో ప్రారంభమై... ఇరాన్, టర్కీ, సిరియా, జోర్డాన్ మీదుగా ఆఫ్రికా, ఈజిప్ట్, యూరప్‌లోని గ్రీస్ వరకూ సాగింది. ఆ తరువాత ఫ్రాన్స్ మీదుగా యూకే అట్లాంటిక్ సముద్రం దాటి కెనడా, అమెరికా చేరుకున్నా. పసిఫిక్ మహా సముద్రం దాటి న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, బంగ్లాదేశ్ మీదుగా భారత్‌కు వచ్చాక మళ్లీ ఉద్యోగ జీవితంలో నిమగ్నమయ్యాను. ఈ క్రమంలోనే మా అమ్మ కుసుమ దయాల్ ఐదుగురి సంతానాన్ని పెంచి పోషించేందుకు చేసిన త్యాగం, పడిన కష్టాలు గుర్తుకువచ్చాయి. అమ్మ లాంటి ఎంతోమంది మాతృమూర్తుల గురించి ప్రపంచానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటేషన్‌కు శ్రీకారం చుట్టాను.

**దేశదేశాల్లోని మహిళల జీవితాలతో...**

195 దేశాల్లోని విభిన్న రాష్ట్రాలు, జాతులు, కులాలు, మతాలు, వర్గాలకు చెందిన పది లక్షల మంది మహిళల జీవితాలను ఆవిష్కరించడమే 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటరీ ప్రధాన ఉద్దేశం. ఉన్నత స్థాయి నుంచి కూలి పనులు చేసుకునే మహిళల వరకు అందరి జీవితాలకు సంబంధించిన కీలక ఘట్టాలు అందులో ఉంటాయి. ఇప్పటివరకూ ఇలా ఇన్ని దేశాల మహిళల ఫొటోగ్రఫీలతో కూడిన డాక్యుమెంటు ఎవరూ చేయలేదు. అందుకే నేను ఈ మహత్తర కార్యం చేపట్టాలని అనుకున్నాను.

**మహిళా దినోత్సవంనాడు...**

'మిలియన్ అమేజింగ్ ఉమెన్స్' డాక్యుమెంటేషన్ పూర్తికావడానికి పది నుంచి పన్నెండేళ్ల సమయం పడుతుందని అంచనా. గత నెల, అంటే మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుజరాత్‌లోని బరోడా నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాను. ఇందులో తొలి పోర్ట్రైట్ ఫొటో బరోడా రాజమాత సుభాంగిని రాజేది. బ్రిటిష్ రాణి కంటే అతిపెద్ద కోటలో ఉండే ఆమెకు సంబంధించిన ఫొటోను తీయడం ద్వారా డాక్యుమెంటేషన్ ప్రారంభమైంది. ఇప్పటివరకూ 400 మందికిపైగా మహిళల ఫొటోలు, వివరాలు సేకరించాను. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన మహిళలపై డాక్యుమెంటేషన్ సాగుతోంది. ప్రస్తుతం ఉత్తర భారత్‌లోని పలు రాష్ట్రాల మహిళలను కెమెరాలో బంధించే పనిలో ఉన్నాను. ఇప్పటివరకు సంప్రతించినవారిలో రోజు కూలీలు, గిరిజన మహిళలు, సామాజిక కార్యకర్తలు, కార్మికులు ఉన్నారు. అన్నీ కలిపి 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాను. కొన్ని వీడియోలు కూడా చిత్రీకరిస్తున్నాను. ప్రతి మహిళ వెనుక ఒక విజయ గాథ ఉంటుంది. దాన్ని ఈ ప్రపంచానికి చెప్పడమే నా ఉద్దేశం. పది లక్షలమంది మహిళలకు సంబంధించిన డాక్యుమెంటేషన్ అంటే సాధారణ విషయం కాదు. ఎన్నో వ్యయ ప్రయాసలు పడాలి. అందుకు సిద్ధమయ్యే ఈ అద్భుత ప్రాజెక్ట్‌ను చేపట్టాను."

**- బూటు శ్రీనివాసరావు**, విశాఖపట్నం

**సంపాదించింది అంతా...**

ఉద్యోగానికి రాజీనామా చేసి ఈ ప్రాజెక్ట్ ప్రారంభించాను. దీని కోసం ఇప్పటివరకూ నేను సంపాదించింది అంతా ఖర్చు చేస్తున్నాను. దీనిలో భాగంగా నా కారును ప్రత్యేకంగా డిజైన్ చేయించుకున్నాను.

## టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న టీడీపీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్ బాషా

**చాగలమర్రి, మే 3 (ఆంధ్రజ్యోతి):** టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. శనివారం చాగలమర్రి గ్రామంలో స్వయం ఉపాధితో ఏర్పాటు చేసుకున్న టైలరింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమితోనే రాష్ట్ర రాజధాని అమరావతి సాధ్యమవుతుందని అన్నారు. యువతీ యువకుల కోసం ప్రభుత్వం ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తోందని అన్నారు. పేదల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అమాయకులపై ఉగ్రవాదులు దాడులు చేయడం తీవ్ర అమానుషమన్నారు. అమరావతి రాజధాని కోసం ప్రధాని మోదీ చేయూతనివ్వడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, మౌళాలి, అనిఫ్, జెట్టి నాగరాజు, జల్సాగౌస్, అజీమ్, రాజేంద్ర పాల్గొన్నారు.

## కౌలు కార్డు ఉంటేనే ప్రభుత్వ పథకాలు

**చాగలమర్రి, మే 3 (ఆంధ్రజ్యోతి):** కౌలు కార్డులు ఉంటేనే కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఏవో రంగనేతాజీ తెలిపారు. శనివారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పొలాలను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న రైతులు కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పంట నష్టపరిహారం, పంట నమోదు, రైతు భరోసా, మద్దతు ధరకు పంటను ప్రభుత్వానికి అమ్ముకోవచ్చని అన్నారు. పొలం తీసుకున్న కౌలు రైతులు యజమాని అగ్రిమెంట్ తీసుకొని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ అవకాశాన్ని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

**చాగలమర్రి, మే 3 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ భీమలింగేశ్వర బ్రహ్మోత్సవాల సందర్భంగా 14న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు లక్ష్మీనారాయణరెడ్డి, నరసింహారెడ్డి శనివారం తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వృషభరాజములకు మొదటి బహుమతి రూ.1.11 లక్షలు, రెండో బహుమతి రూ.75 వేలు, మూడవ బహుమతి రూ.50 వేలు, నాల్గో బహుమతి రూ.10 వేలు దాతల సహకారంతో నగదు అందజేస్తామని అన్నారు.

## సంచార వైద్య సేవలు వినియోగించుకోవాలి

**చాగలమర్రి, మే 3 (ఆంధ్రజ్యోతి):** గ్రామాల్లో 104 వాహనం ద్వార జరిగే సంచార వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మండలంలోని చెంచుగూడెంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి చెంచులకు వివిధ పరీక్షలు చేశారు. వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వడదెబ్బకు గురై మృతి చెందితే ప్రభుత్వం రూ.4 లక్షలు ఆర్థిక సాయం అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్థిక విస్తరణాధికారి సుబ్బరాయుడు, ఏఎన్ఎం సంధ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## కుట్టుమిషన్ల శిక్షణా శిబిరం తనిఖీ

**శిరివెళ్ల, మే 3(ఆంధ్రజ్యోతి) :** శిరివెళ్లలోని డీపెప్ పాఠశాలలో మహిళలకు నిర్వహిస్తున్న కుట్టుమిషన్ల శిక్షణా శిబిరాన్ని ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప శనివారం తనిఖీ చేశారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో మహిళల హాజరుశాతం, అక్కడి వసతులను ఆయన పరిశీలించారు. మొదటి విడతలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామని ఎంపీడీవో తెలిపారు.

## రీ సర్వేపై అవగాహన పెంచుకోవాలి

**ఉయ్యాలవాడ, మే 3(ఆంధ్రజ్యోతి):** రీ సర్వేపై రైతులు అవగాహన పెంచుకోవాలని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆర్. పాంపల్లె గ్రామంలో రీ సర్వేపై ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో 1600 ఎకరాలను రీ సర్వే చేస్తున్నామన్నారు. 472 ఖాతాలు, 404 సర్వే నంబర్లు ఉన్నాయని, గ్రామంలో 90 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. రైతుల సమక్షంలో వారికి అనుకూల సమయంలో సర్వే చేస్తామని ఆయన తెలిపారు కార్యక్రమంలో డిప్యూటీ తమసీల్దారు ప్రసాద్‌బాబు, మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్వో లక్ష్మీనారాయణరెడ్డి, గ్రామ సర్వేయర్లు ఉన్నారు.

## ఫ్యాక్షన్‌తో కుటుంబాలు చిన్నాభిన్నం



గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫ్యాక్షన్ జోన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి

**కొలిమిగుండ్ల, మే 3 (ఆంధ్రజ్యోతి):** ఫ్యాక్షన్ జోలికెళితే కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని వాటి జోలికి వెళ్లవద్దని ఫ్యాక్షన్ జోన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం చింతలాయపల్లె, తుమ్మలపెంట, అంకిరెడ్డిపల్లె, తదితర గ్రామాలో సీఐ రమేశ్‌రెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల నాయకులు, ప్రజలను సమావేశపరచి ఫ్యాక్షన్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రతి ఒక్కరు ప్రశాంతంగా జీవనం కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు స్వామినాయక్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సర్వేయర్

**కొలిమిగుండ్ల, మే 3 ( ఆంధ్రజ్యోతి):** మండలంలోని తుమ్మలపెంట సర్వేయర్ ఆదిలక్ష్మి శనివారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఘటన చోటు చేసుకుంది. సర్వేయర్ ఆదిలక్ష్మి రీసర్వే పనులు పూర్తి చేసుకొని స్కూటీపై తాడిపత్రికి వెళ్తుండగా ప్రమాదవశాత్తూ అదుపుతప్పి బోల్తా పడడంతో సర్వేయర్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం అనంతపురం వైద్యశాలకు తరలించారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

**డోన్ టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని అప్రూవల్ లేఅవుట్ కళ్యాణ్ ఎస్టేట్‌లో గత ప్రభుత్వంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను శనివారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, సీపీవో శభరీష్ కూల్చివేశారు. కమిషనర్ ప్రసాద్‌గౌడు మాట్లాడుతూ ఎల్‌పీ.నెంబర్.125/90 సర్వేనెంబర్380/ఏ1, ఏబీసీ, 383/2, 3, 4 మరియు 385/2ఏ, 2బీ, 2సీలో ఖాళీ స్థలంలోని 50 సెంట్లను అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని, వారికి నోటీసులు ఇచ్చినాస్పందించకపోవడంతో వాటిని కూల్చివేశామని తెలిపారు.

● **న్యాయం చేయండి : బాధితులు:**

గత ప్రభుత్వంలోని మున్సిపల్, సంబంధిత అధికారులు పట్టాలు మంజూరు చేశారని సుంకన్న, లక్ష్మీదేవితో పాటు మరో పది మందికి పైగా బాధితులు వాపోయారు. ఈ ప్రభుత్వంలోని అధికారులు కూల్చడం ఏమిటని ప్రశ్నించారు. మాతో పాటు మరో ఇద్దరు నిర్మాణాలు చేశారని, మరి ఎందుకు వాటి నిర్మాణాలను కూల్చలేదని మున్సిపల్ అధికారులను నిలదీశారు.

## ఎమ్మెల్యే కోట్లకు పరామర్శ

**డోన్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి):** ఇటీవల ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి డోన్ టీడీపీ సీనియర్ నాయకులు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సీలం భాస్కర్ నాయుడు హైదరాబాదులో ఎమ్మెల్యే నివాసంలో కలిసి పరామర్శించారు. టీడీపీ బీసీ సెల్ నాయకులు ఆలేబాదు ప్రకాష్, ఉడుములపాడు నాగేంద్ర ఎమ్మెల్యేను పరామర్శించిన వారిలో ఉన్నారు.

## రక్షణ కరువు!

### భయం గుప్పిట్లో ప్రయాణం



గోపాల్ నగరం గ్రామం దగ్గర దెబ్బతిన్న రహదారి రక్షణ గోడ

**ప్యాపిలి, మే 3 (ఆంధ్రజ్యోతి):** మండలంలో గ్రామీణ రహదారులు రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. దీంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణిఖులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణ సాగిస్తున్నారు. మండల కేంద్రం నుంచి ఊటకొండ, జలదుర్గం, గార్లదిన్నే, బావిపల్లి, హుసేనాపురం తదితర గ్రామాలకు వెళ్లే రహదారుల రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా గోపాల్‌నగరం గ్రామం రోడ్డు ప్రక్కన లోయలు ఉన్నాయి. ఈ లోయకు అడ్డంగా గతంలో రక్షణ గోడలు నిర్మించారు. అయితే ఈ గోడలు దెబ్బతిన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడలకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## అడుగంటుతున్న తుండ్లవాగు రిజర్వాయర్

**రుద్రవరం, మే 3 (ఆంధ్రజ్యోతి) :** నల్లమల అటవిలో ఉన్న తుండ్లవాగు రిజర్వాయరు అడుగంటుతోంది. ఎండలు ఒక వైపు గాలికి నీరు రోజురోజుకూ తగ్గిపోతుంది. తుండ్లవాగు రిజర్వాయరు నుంచి హరినగరం మంచినీటి పథకానికి నీటి సరఫరా అవుతోంది. ఆళ్లగడ్డ పట్టణానికి మంచినీటి గండం పొంచి ఉంది. హరినగరం మంచినీటి పథకం నుంచి ఆళ్లగడ్డ, నరసాపురం, వడగండ్ల, ముత్తలూరు గ్రామాలకు మంచినీటి సరఫరా అవుతుంది. తుండ్లవాగులోనే నీటి సామర్థ్యం రోజురోజుకూ తగ్గిపోవడంతో మంచినీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉంది. తెలుగుగంగ అధికారులు వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి ప్రధాన కాల్వ ద్వారా తుండ్లవాగుకు నీరు విడుదల చేసి తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నల్లమల అడవిలోని తుండ్లవాగు రిజర్వాయర్

## సమస్యల్లో ముత్యాలపాడు ఆరోగ్య కేంద్రం



ముత్యాలపాడులో శిథిలావస్థలో ఆరోగ్య ఉపకేంద్రం

**చాగలమర్రి, మే 3 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ముత్యాలపాడు ఆరోగ్య కేంద్రం సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. గ్రామంలో నూతన పీహెచ్‌సీని కేటాయించి రెండేళ్లు పూర్తయిన నేటికి భవన నిర్మాణం జరగలేదు. గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గత వైసీపీ ప్రభుత్వంలో ముత్యాలపాడుకు పీహెచ్‌సీని కేటాయించి వైద్యులను నియమించారు. అరకొరగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. రోగులకు మాత్రం వైద్య సేవలు అందించేందుకు సొంత భవనం లేక పోవడంతో పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైన ముత్యాలపాడులో ఆసుపత్రి నిర్మాణానికి నిధులు కేటాయించి ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ముత్యాలపాడు పరిధిలోకి వచ్చే 7 సచివాలయాల్లో ఎఫ్‌డీపీలో పాల్గొనేందుకు 20 రోజులు కేటాయిస్తున్నారు. ఉన్న 10 రోజులు స్థానికంగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వైద్య సేవలు అందక ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు.

# డిగ్రీ కళాశాలను అభివృద్ధి చేస్తా: మంత్రి బీసీ



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదులకు భూమి పూజ చేస్తున్న మంత్రి బీసీ



కొవెలకుంట్లలో డ్రైనేజీని పరిశీలిస్తున్న మంత్రి

**బనగానపల్లె మే 3 ( ఆంధ్రజ్యోతి):** బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి చేస్తానని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ పథకం కింద మంజూరైన రూ.4 కోట్లతో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. మంత్రి బీసీ మాట్లాడుతూ బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌళిక వసతుల కల్పనకు గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదన్నారు. 2014-19 సంవత్సరంలో తాను డిగ్రీ కళాశాల అభివృద్ధికి నిధులు తెచ్చానని, అప్పటి ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వల్ల వెనక్కుపోయాయన్నారు. గతవైసీపీ హయంలో నాడు -నేడు పనులు పూర్తిచేయక పోవడంతో అభివృద్ధి కుంటుబడిందన్నారు. డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఇబ్బంది పడుతుండడంతో దీంతో మొత్తం 12 గదులు నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రిన్సిపాల్ లలిత మహిళలకు టాయిలెట్ సౌకర్యం, వెయిటింగ్‌హాల్, తాత్కాలిక మరమత్తులు, కాంపౌండ్ వాల్ లేకపోవడంతో దొంగతనాలు జరుగుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకు వెళ్లగా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలోసీఐ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ ఎల్లమ్మ, ఉపసర్పంచ్ బురానుద్దీన్, టంగుటూరు శ్రీనయ్య, మిట్టపల్లె సర్పంచ్ తులసిరెడ్డి, సలాం, నియాజ్‌హుసేన్, క్రైప రఘునాథ రెడ్డి, అల్తాఫ్‌హుసేన్, అన్ను, ఎంపీడీవో రమణ, ఈవోఆర్‌డీ సతీశ్‌రెడ్డి, ఈఈ నాగరాజు, డీఈ వీరయ్య, ఏఈ మధు, ఏఈసాయికృష్ణ, కళాశాల అధ్యాపకులు అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి బీసీని కళాశాల ప్రిన్సిపల్ లలిత ఆధ్వర్యంలో సత్కరించారు.

### ఎంపీపీ కార్యాలయానికి భూమిపూజ

**కొవెలకుంట్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) :** బనగానపల్లె నియోజకవర్గం కొవెలకుంట్ల మండల ప్రజాపరిషత్ నూతన కార్యాలయానికి శనివారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి భూమిపూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం కట్టిన పాత ఎంపీపీ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో రూ.1.50 కోట్లతో ఎంపీపీ కార్యాలయం నిర్మాణం చేపడుతున్నామన్నారు.

**తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తా**

నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా అవసరమైతే తన సొంతనిధులతో సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి బీసీ జనార్ధనరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని శిథిలావస్థలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాల స్థానంలో నూతన కార్యాలయాలు నిర్మించడానికి శ్రీకారం చుట్టిందని అన్నారు.

● స్వచ్ఛ ఆంధ్ర స్ఫూర్తితో మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి అన్నారు. శనివారం ఆయన కొవెలకుంట్ల పట్టణంలోని వాల్మీకినగర్, పాండురంగస్వామి సర్కిల్ పరిధిలో డ్రైనేజీ కాల్వలను పరిశీలించారు. డ్రైనేజీ కాల్వలు చెత్త చెదారంతో నిండి అపరిశుభ్రంగా ఉండడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాల్వల్లో చెత్తచెదారాన్ని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు.

**చెన్నకేశవస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తా**

అవుకు: అవుకులోని చెన్నకేశవస్వామి ఆలయాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో రైతు సంఘం నాయకులు, పట్టణ ప్రజలతో సమావేశం నిర్వహించారు. బీసీ మాట్లాడుతూ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రతి ఏటా వైశాఖ శుద్ధపౌర్ణమికి జరుపడం ఆనవాయితీ అన్నారు. దేవాలయానికి 53 ఎకరాలు మాన్యం ఉండగా ప్రస్తుతం రూ.3లక్షల మాత్రమే ఆదాయం వస్తోందన్నారు. ఆలయం దేవాదాయశాఖ పరిధిలో ఉన్నా గతంలో రైతు సంఘం ఆధ్వర్యంలోనే స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించేవారన్నారు. ఇకనుంచి దేవాదాయశాఖ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఒక కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి, టీడీపీ నాయకుడు కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ నాయక్, టీడీపీ నాయకులు పత్తిని మద్దిలేటి గౌడ్, అరుణ్‌కుమార్‌నాయక్, దంతెల రమణ, రైతు సంఘం నాయకులు వెంకప్ప, సీతారామయ్య, గుడిపాటి శివ, ఎల్లాల వెంకటేశ్వర్లు, బొజ్జలయ్య, మిద్దె శ్రీనివాసులు, ప్రభాకర్, శ్రీరాములు, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి




మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

**డోన్ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి):** ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని కులవృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సీడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పోటాన్ ఇన్‌స్టిట్యూట్ నందు పీఎం విశ్వకర్మ కుల వృత్తులకు నైపుణ్య శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్లను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ధర్మవరం సుబ్బారెడ్డి హాజరయ్యారు. సుబ్బారెడ్డి చేతుల మీదుగా సర్టిఫికేట్లను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ పథకం కింద అందించే ప్రయోజనాలను వినియోగించుకోవాలని కోరారు. వీటి ద్వారా జీవనోపాదిని చేసుకుంటూ కుటుంబపరంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రజా వైద్యశాల మల్లికార్జున, పోటాన్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ సాయినాథ్, మేనేజర్ స్మితాదేవి పాల్గొన్నారు.

# వీధి కుక్కల నుంచి కాపాడండి

● కాలనీవాసులు నగర పంచాయతీ కార్యాలయం దిగ్బంధం



పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న ప్రజలు

**బేతంచెర్ల, మే 3 (ఆంధ్రజ్యోతి):** బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలోని కాలనీల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, వాటిని ఊరి బయటకు తరలించాలని ఎన్నిఆర్లు అధికారులకు విన్నవించినా చర్యలు చేపట్టలేదని ప్రజలు ఆరోపించారు. నగర పంచాయతీ కార్యాలయాన్ని హనుమాన్ నగర్ కాలనీవాసులు శనివారం ముట్టడించారు. హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన సయ్యద్ హుశేన్‌బాషా, ఆశాబీ దంపతుల కుమారుడు మొహిద్దీన్ (4) అనే బాలుడు సచివాలయ ప్రాంగణంలో ఆడుకుంటూ ఉండగా.. కుక్కలు వెంట పడటంతో దాడి చేశాయన్నారు. ఈ దాడిలో బాలుడు మృతి చెందారన్నారు. కాలనీ వాసలు రోడ్డుపై ధర్నా చేశారు. స్పందించిన చైర్మన్ చలంరెడ్డి, కమిసనర్ హరిప్రసాద్, మండల ప్రత్యేక అధికారిని బషీరున్నీషా భేగం పట్టణంలోని కుక్కలను తరలించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన్నా కూడా కాలనీవాసులు ధర్నాను విరమించలేదు. వీరువురి మధ్య కాసేపు వాగ్వావాదం చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వరరావు కల్పించుకుని సర్ది చెప్పడంతో రాతపూర్వకంగా వినతి పత్రం అందజేస్తే తప్ప తాము ధర్నాను విరమించుకోమని కాలనీవాసులు భీష్మించారు. ఇప్పటికే నలుగురు కుక్క కాటుకు చనిపోయారన్నారు. కుక్కల నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడంతో సమస్య సర్దుమనిగింది.

### బాలుడి కుటుంబాన్ని ఆదుకుంటాం: ఎమ్మెల్యే

బేతంచెర్ల పట్టణంలోని హనుమాన్‌నగర్ రైల్వే బ్రిడ్జి సమీపంలో శుక్రవారం కుక్కల దాడిలో మృతి చెందిన సయ్యద్ మొహిద్దీన్ (4) కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కోట్ల సమయానికి అందుబాటులో లేకపోవడంతో వీడియో కాల్ ద్వారా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాలుడి కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.5 లక్షలు అందజేశారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అలాగే మృతుని కుటుంబ సభ్యులకు యువ నాయకురాలు కోట్ల చిత్రమ్మ ఆదేశాల మేరకు కృష్ణవర్ధన్ రెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ముస్లిం మైనార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి జాకీరుల్లా భేగ్ రూ.5వేలు మున్సిపల్ కమిషనర్‌హరిప్రసాద్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మండల ప్రత్యేక అధికారి బషీరున్నీసా బేగం, టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఎల్లనాగయ్య, పోలూరు రాఘవరెడ్డి, తిరుమలేష్ చౌదరి, వార్డు కౌన్సిలర్ రామాంజనేయులు, టైలర్ రాముడు, రవీంద్ర నాయక్, మాదవ ఉన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

## సమస్యలను పరిష్కరించండి

**బనగానపల్లె మే 3 ( ఆంధ్రజ్యోతి):** సమస్యలను పరిష్కరించి, ఆదుకోవాలని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో కమ్యూనిటీ హెల్త్ సిబ్బంది కోరారు. శనివారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి శనివారం వినతి పత్రం సమర్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆయూష్మాన్ ఆరోగ్య కమ్యూనిటీ హెల్త్ అధికారులుగా చేస్తున్న తమకు గత రెండేళ్లనుంచి జీతాలు లేవన్నారు. ఎన్‌హెచ్ ఉద్యోగులకు 23 శాతం వేతన సవరణ ఇచ్చినప్పటికి మాకు వేతన సవరణ చేయకపోగా ప్రతి నెల ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు సీఎం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సెక్రటరీ గురుప్రసాద్, కోఆర్డినేటర్ సురేశ్‌బాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు వినోద్‌కుమార్, సబ్ ట్రెజరర్ హారిక పాల్గొన్నారు.

## ఘనంగా చౌడేశ్వరీమాత విగ్రహ ప్రతిష్ఠ



మంత్రి దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

**బనగానపల్లె మే 3 ( ఆంధ్రజ్యోతి):** మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో శనివారం చౌడేశ్వరీమాత అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శనివారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు పాల్గొని పూజలు చేశారు. గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులకు కార్యక్రమంలో మౌళీశ్వరరెడ్డి, కుమార్‌రెడ్డి తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు. బీసీ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందించారు.

## నేటి నుంచి కన్యకాపరమేశ్వరి వజ్రోత్సవ వేడుకలు

**కొవెలకుంట్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) :** కొవెలకుంట్లలోని కన్యకాపరమేశ్వరి వజ్రోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు పట్టణ ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆదివారం శ్రీవారాహి అమ్మవారి ఊరేగింపు, 5న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, రాత్రి 7గంటలకు పార్వతీ పరమేశ్వరుల గ్రామోత్సవం, 6న సీతారామ కళ్యాణం, రాత్రి 7 నుండి గ్రామోత్సవం, 7న వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు, రాత్రికి గజ గౌరీదేవి గ్రామోత్సవం, హంపీ పీఠాధిపతులు శ్రీశ్రీ విద్యారణ్య భారతీ తీర్థ మహాస్వామివారిచే ఆధ్యాత్మిక ప్రవచనం, 8న హంపీ పీఠాధిపతులు శ్రీశ్రీ విద్యారణ్య భారతీ తీర్థ మహాస్వామిచే మహాకుంభాభిషేకం, మహాపూర్ణాహుతి, సాయంత్రం 5 నుండి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## 7న పెద్దమ్మ జాతర

**చాగలమర్రి, మే 3 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో రెండు రోజుల పాటు పెద్దమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు పేర్కొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ 10 ఏళ్లకు ఒక సారి గ్రామంలో జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. 6, 7 తేదీల్లో పెద్దమ్మ దేవతర జాతరను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. గ్రామస్థుల ఐకమత్యంతో జాతరను నిర్వహించి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ జాతరను విజయవంతం చేయాలని కోరారు.

## ఆధారాలు లేకుండా మాట్లాడడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

**డోన్ టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి):** మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిపై ఆధారాలు లేకుండా మాట్లాడడం సరికాదని మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, జడ్పీటీసీ బద్దెల రాజ్‌కుమార్ యాదవ్, పట్టణ వైసీపీ అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఆధారాలు లేకుండా మాజీ మంత్రి బుగ్గన పై టీడీపీ నాయకుడు మర్రి రమణ దుష్ప్రచారం చేయడం తగదన్నారు.

పట్టణ సమీపాన ఉన్న మహాత్మ జ్యోతిరావు గురుకుల పాఠశాల, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లు దొరపల్లె గ్రామంలోకి ఉన్నాయనడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. దొరపల్లె గ్రామంలో ఉంటే డోన్ మండలంలోకి రాదా.. డోన్‌కు సంబంధించినది కాదా అని ప్రశ్నించారు. ఆయన మాటలు దెయ్యాలు వేదాలు అల్లినట్లుగా ఉన్నాయని పేర్కొన్నారు. బుగ్గన అభివృద్ధి చేసింది డోన్‌కే కాదు.. రాష్ట్రానికి తెలుసునని తెలిపారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు మానుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు సోమేష్ యాదవ్, వైసీపీ నాయకులు మల్యాల శ్రీనివాసరెడ్డి, మోహన్ రెడ్డి, కోఆప్షన్ మెంబర్ కుమ్మరి రాజు, సుంకన్న తదితరులు ఉన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య

**కొలిమిగుండ్ల, మే 3 ( ఆంధ్రజ్యోతి):** మండలంలో అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన చాకలిరాముడు(67) అనే వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చాకలిరాముడు గత కొంతకాలంలో మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఇంటిలో ఎవరూ లేని సమయంలో శనివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.